

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



అక్షర రాజముద్ర

www.rajamudranews.com

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 14.07.2026 | సంపుటి : 3 | సంచిక: 162 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | TUESDAY | 14.07.2026 | V0LUME : 3 | ISSUE : 162 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


# ఆరు నెలల గరిష్ఠానికి ద్రవ్యోల్బణం.. తెలంగాణలోనే అత్యధిక నమోదు

- జూన్‌లో 4.38 శాతానికి చేరిన రిటైల్ ద్రవ్యోల్బణం
- ఆర్బీఐ లక్ష్యాన్ని దాటిన 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు
- తెలంగాణలో 6.36 శాతం, ఏపీలో 5.39 శాతం నమోదు
- ఆహార పదార్థాలు, రవాణా, బంగారం ధరలతో పెరిగిన భారం

**న్యూఢిల్లీ, జూలై 13**

దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుదల బాట పట్టింది. జూన్ నెలలో ద్రవ్యోల్బణం 4.38 శాతానికి చేరి గత ఆరు నెలల్లో అత్యధిక స్థాయిని నమోదు చేసింది. ఆహార పదార్థాలు, రవాణా సేవలు, బంగారం, వెండి వంటి విలువైన లోహాల ధరలు పెరగడం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించిన 4 శాతం లక్ష్యాన్ని దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సగానికి పైగా ప్రాంతాలు అధిగమించాయి.

**తెలంగాణలో అత్యధిక ద్రవ్యోల్బణం**

రాష్ట్రాల వారీగా పరిశీలిస్తే తెలంగాణలో అత్యధికంగా 6.36 శాతం ద్రవ్యోల్బణం నమోదైంది. ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరిలో చెరో 5.39 శాతం నమోదవగా, తమిళనాడులో 5.24 శాతం, ఒడిశాలో

మిగతా 2వ పేజీలో..









# ముందస్తు సీట్ల లెక్కలు..
# కాంగ్రెస్-బీఆర్ఎస్ మైండ్ గేమ్

- ఎన్నికలకు ముందే సర్వేల పేరిట రాజకీయ వేడి
- 78 సీట్లు బీఆర్ఎస్ వేనంటున్న కేటీఆర్
- 117 స్థానాల్లో కాంగ్రెస్ విజయమంటూ రేవంత్ ధీమా
- క్యాడర్‌లో నమ్మకం పెంచుకునే ప్రయత్నాల్లో రెండు పార్టీలు
- ముందస్తు రాజకీయ వ్యూహాలపై ఆసక్తికర చర్చ

3

# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- హైదరాబాద్ కు ఐఐఎం.. మెట్రో విస్తరణే లక్ష్యం
- ఐఐఎం సాధనలో బీజేపీ ఎంపీలు చొరవ చూపాలి
- ఏపీ నుంచి 'ఎన్‌ఓసీ'లు.. కేంద్రం రాయబారం కీలకం
- ఎంపీల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు



**హైదరాబాద్, జూలై 13 :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించగలమని, రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సోమవారం జరిగిన రాష్ట్ర పార్లమెంట్ సభ్యుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా

మిగతా 2వ పేజీలో..

## స్వర్ణ పతక విజేత ప్రవల్లికకు సీఎం అభినందనలు

- ఏషియా అండర్-23 అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పరుగు పందెంలో..

2

## విద్యార్థుల్లో కుల వివక్షను దూరం చేస్తున్నాం

- యంగ్ ఇండియా స్కూళ్లతో విద్యాభివృద్ధి

2



## వైఐపీఎస్ నిర్మాణ పనుల్లో జాప్యాన్ని సహించను

- నిర్లక్ష్యం, ఆలస్యాన్ని సహించేది లేదు
- యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి
- ఆదర్శ విద్యా సంస్థగా వైఐపీఎస్
- డీపీజీ ఆనంద్

2

## అధికారుల సమస్యలపై సత్వర నిర్ణయం తీసుకోండి

- సింగరేణి యాజమాన్యానికి ఉప ముఖ్యమంత్రి ఆదేశాలు

**సింగరేణి భవన్, జూలై 13 :**

సింగరేణిలో సుమారు 2,200 మంది అధికారులకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై వీలైనంత త్వరగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. కోల్ ఇండియా సంస్థల మాదిరిగా సింగరేణి అధికారుల వేతన సవరణ, పర్‌ఫార్మెన్స్

మిగతా 3వ పేజీలో..





## సుప్రీం కోర్టు సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం

- బనకచర్లపై పిటిషన్ అంతా తప్పులదడక
- గురువు చంద్రబాబు కోసమే డ్రామాలు
- మరోమారు మండిపడ్డ బీఆర్ఎస్ నేత హరీష్ రావు

3

## షాబాద్ ఉన్మాది రాజ్‌కుమార్ ఆత్మహత్య!

- కొత్తూరు మండలం పంజర్లలో శవమై తేలిన నిందితుడు
- పోలీసులకు దొరకకుండా బలవన్మరణం

2






## ఎల్‌నినో ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధం

- కలెక్టర్లు, వ్యవసాయాధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశం

3

## కాళేశ్వరంపై కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు

గోదావరి నీరు వృథాగా సముద్రంలోకి

రైతులకు నీళ్లు ఇవ్వని రేవంత్ ప్రభుత్వం

నీరు విడుదల చేయకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం

ఎన్‌డీఎస్ఏ వంకతో కాళేశ్వరం నీరు ఎత్తిపోయడంలేదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3






# స్వర్ణ పతక విజేత ప్రవల్లికకు సీఎం అభినందనలు

హైదరాబాద్, జూలై 13 :

చైనాలోని ఒర్డోస్‌లో జరుగుతున్న తొలి ఏషియా అండర్23 అథ్లెటిక్ చాంపియన్‌షిప్2026లో మహిళల 4I400 రిలే పరుగు పందెంలో స్వర్ణ పతకం సాధించిన ప్రవల్లిక నరిమళ్లకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. తెలంగాణ బిడ్డ ప్రవల్లిక ఆసియా23 అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్స్‌లో అసమాన ప్రతిభ కనబరిచి మహిళల 4I400 మీటర్ల రిలేలో ఆమె స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నారు. నల్గొండలోని ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీలో చదువుతూ డిండి గురుకుల స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొంది అంతర్జాతీయ వేదికపై రాణించిన ప్రవల్లిక యువ క్రీడాకారులు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారని ప్రశంసించారు. తాపీ మేస్త్రీ కూతురైన ప్రవల్లిక పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారన్నారు. ఈ జట్టులో ప్రవల్లిక, శ్రావణి సచిన్ సాంగ్లే, సాంద్రమోల్ సాబు, నోఫిసా ఖతూన్‌లతో కలిసి స్వర్ణ పతకం సాధించారు. ఈ నలుగురి బృందం 3:33.62 సెకన్ల సమయంతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుని, ఆతిథ్య దేశమైన చైనాను అధిగమించింది. అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడానికి ముందే ప్రవల్లిక వివిధ వేదికల్లో 23 స్వర్ణాలు సహా మొత్తం 35 రాష్ట్రస్థాయి పతకాలను సాధించి అద్భుతమైన దేశీయ రికార్డును నెలకొల్పారు. ప్రవల్లికకు శిక్షణ అందించిన కోచ్‌లకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఈ చాంపియన్‌షిప్‌లో మొత్తంగా 3 స్వర్ణ, 4 రజత, 9 కాంస్య పతకాలతో 16 పతకాలను సాధించిన భారత క్రీడాకారులందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.



# విద్యార్థుల్లో కులవివక్షను దూరం చేస్తున్నాం

- **యంగ్ ఇండియా స్కూళ్లతో విద్యాభివృద్ధి**
- **ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో సిఎం రేవంత్**

హైదరాబాద్,జులై 13:

జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు కీలక చర్యలు చేపట్టామని వెల్లడించారు. ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే అకడమిక్ ఇయర్ నుంచి వీటిని అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేశామని సీఎం వ్యాఖ్యానించారు. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్ స్కూల్లోనే అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ లోపల ఉన్న ప్రాంతంలో మొదటగా వీలైనన్ని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌స్‌ను పెంచుతున్నామని వివరించారు. రాష్ట్రంలో ఉన్న ఎస్సీలకు వారి జనాభా శాతం కంటే ఎక్కువ అవకాశాలను కల్పిస్తున్నామని సీఎం వెల్లడించారు. రాజకీయాల్లో, ఇతర రంగాల్లో కీలక స్థానాల్లో ఎస్సీలకు అవకాశాలు కల్పించామని వ్యాఖ్యానించారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.



# ఆరు నెలల గరిష్ఠానికి ద్రవ్యోల్బణం.. తెలంగాణలోనే అత్యధిక నమోదు

మొదటిపేజీ తరువాయి

5.15 శాతం, మధ్యప్రదేశ్‌లో 5.09 శాతం నమోదైంది. కర్ణాటక, ఉత్తరప్రదేశ్, కేరళ, గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో కూడా ద్రవ్యోల్బణం ఆర్బీఐ లక్ష్యాన్ని మించింది. మరోవైపు మిజోరంలో అత్యల్పంగా 1.63 శాతం నమోదవగా, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ తదితర రాష్ట్రాల్లో కూడా ద్రవ్యోల్బణం తక్కువగానే నమోదైంది.

**ఆహార ధరలే ప్రధాన కారణం**

మే నెలలో 3.93 శాతంగా ఉన్న దేశ రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో 4.38 శాతానికి పెరిగింది. ఆహార ద్రవ్యోల్బణం 4.78 శాతం నుంచి 5.32 శాతానికి చేరుకుంది. అల్లం, టమాటా, కిస్మిస్ వంటి ఆహార పదార్థాల ధరలు గణనీయంగా పెరిగాయి. అలాగే నగలు, సరుకు రవాణా, వ్యక్తిగత వాహనాల నిర్వహణ, హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార సేవల ధరలు కూడా పెరగడంతో వినియోగదారులపై అదనపు భారం పడింది.

**కొన్ని విభాగాల్లో ఉపశమనం**

కొన్ని వస్తువుల ధరలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. వాహనాల కొనుగోలు ధరలు, గృహోపకరణాలు, వినోద వస్తువులు, పానీయాలు, సమాచార, కమ్యూనికేషన్ సేవల ధరల్లో స్వల్ప తగ్గుదల నమోదైంది. అయితే బంగారం, వెండి ధరలు పెరుగుతూనే ఉండగా, వెండి ఆభరణాల ధరల్లో భారీ పెరుగుదల కనిపించింది. ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో రానున్న నెలల్లో ధరల పరిస్థితిపై ఆర్థిక వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

# వైఐపీఎస్ నిర్మాణ పనుల్లో జాప్యాన్ని సహించను

హైదరాబాద్, జూలై 13:

రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో ప్రభుత్వం, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్(వైఐపీఎస్) నిర్మాణ పనుల్లో జాప్యంపై డీజీపీ సి.వి.ఆనంద్ తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపై రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ సొసైటీ అధ్యక్షుడు సి.వి. ఆనంద్అ ధ్యక్షతన సొసైటీ కమిటీ సమావేశం నిర్వహించారు.నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం, ఆలస్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆయన కఠినంగా ఆదేశించారు. ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతతో పాటు వేగానికి కూడా అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని హెచ్చరించారు. దేశంలోనే తొలిసారిగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక విద్యాసంస్థలో పోలీస్ కుటుంబాల పిల్లలతో పాటు సాధారణ కుటుంబాల పిల్లలకు కూడా ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో అత్యాధునిక మౌలిక వసతులు, ఆధునిక బోధనా విధానాలు, విలువలతో కూడిన విద్య, క్రీడలు, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత కల్పిస్తూ విద్యాబోధన కొనసాగుతోంది. సమావేశంలో పాఠశాల రెండో విద్యా సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఇప్పటివరకు సాధించిన పురోగతిపై డిజిపి సమగ్ర సమీక్ష నిర్వహించారు. 2025-26 విద్యా సంవత్సరంలో 345 మంది విద్యార్థులు నమోదు కాగా, 2026-27 విద్యా సంవత్సరానికి 360 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు అధికారులు వివరించారు. గత విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు తరగతులు నిర్వహించగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిని ప్రారంభించారు. ప్రస్తుతం నర్సరీ నుంచి ఆరో తరగతి వరకు బోధన కొనసాగుతున్న ఈ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరంలో మొత్తం 360 మంది విద్యార్థుల్లో




184 మంది పోలీస్ కుటుంబాలకు చెందినవారు, 176 మంది నాన్‌పోలీస్ కుటుంబాలకు చెందినవారు ఉన్నట్లు సమావేశంలో వెల్లడించారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో అందిస్తున్న నాణ్యమైన విద్యపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి ఇది నిదర్శనమని సభ్యులు అభిప్రాయపడ్డారు. పాఠశాల విస్తరణలో భాగంగా నూతనంగా 17 తరగతి గదులతో కూడిన నూతన అకాడమిక్ బ్లాక్ నిర్మాణ నమూనాను డిజిపికి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలలో ఒకటిగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, సృజనాత్మకతను పెంపొందించేలా ప్రపంచ స్థాయి విద్యను అందించాలని అన్నారు. విద్యతో పాటు అత్యాధునిక మౌలిక వసతులు, సురక్షితమైన విద్యా వాతావరణం, ఆధునిక బోధనా పద్ధతులను కల్పించడంతో పాటు క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ సూచించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక, మానసిక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందడంతో పాటు మాదకద్రవ్యాలు వంటి సామాజిక దురలవాట్లకు దూరంగా ఉండే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. పిల్లలు సురక్షిత వాతావరణంలో విద్యనభ్యసిస్తారనే నమ్మకం తల్లిదండ్రుల్లో ఉందని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టే బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందని డీజీపీ అన్నారు.

పాఠశాల పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రొక్యూర్‌మెంట్ కమిటీ, అకాడమిక్ కమిటీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిటీ, కోఆర్డినేషన్ కమిటీ తదితర కమిటీలను ఏర్పాటు చేశారు. విధివిధానాలను సమావేశంలో ఆమోదించారు. విద్యా ప్రమాణాల మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధి, పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా ఈ కమిటీలు పని చేయనున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు, విద్యా కార్యక్రమాలు, బోధనా విధానాలు, మౌలిక వసతులు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై స్కూల్ ప్రిన్సిపల్, సిబ్బంది పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సొసైటీ సభ్యులకు వివరించారు. నూతన అకాడమిక్ బ్లాక్ నిర్మాణాన్ని వేగవంతం చేసి, ప్రతి అంశంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని డిజిపి అధికారులకు సూచించారు. సమావేశంలో డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, డీజీ(గ్రేహౌండ్స్ & ఆక్టోపస్) డాక్టర్ అనిల్ కుమార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, ఐజీ (ప్రొవిజనింగ్ & లాజిస్టిక్స్) గజరావు భూపాల్, ఫైనాన్షియల్ అడ్వైజర్ శరత్ కుమార్, ఏఐజీ (లా & ఆర్డర్) రమణ కుమార్, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రిన్సిపల్ అనితా రెడ్డి, సీఎస్ఆర్ కోఆర్డినేటర్ దీప్తి, జీఎం రాజేష్, విశాల్, సతీష్, సాక్షి, సొసైటీ సభ్యులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి

ఆయన పలు అంశాలపై ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌కు ఐఐఎం తీసుకురావాలని, ఇందుకు బీజేపీ ఎంపీలు చొరవ చూపాలని కోరారు. మెట్రో విస్తరణకు కేంద్ర సహకారం అవసరం అంటూ ఇందుకు సంబంధించి రుణాల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలన్నారు. భూసేకరణ ఒక కొలిక్కి వచ్చిందని, కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని ఆరఆరఆర్‌ను పూర్తి చేసుకోవాల్సి ఉందని చెప్పారు. మూసీ పునరుజ్జీవానికి సంబంధించి కేంద్రం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కోసం అనుమతులు వచ్చేలా కృషి చేయాలని ఎంపీలను ఆయన కోరారు. సాగునీటికి సంబంధించి తుంగభద్ర గేట్ల ప్రారంభోత్సవం సందర్భంగా సీఆర్ పాటిల్‌తో చర్చించామని, ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంవోసీ ఇవ్వాల్సి ఉందని, డిండి 30 టీఎంసీలకు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు 90 టీఎంసీలకు ఎంవోసీ ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఈ అంశం చర్చల దశలో ఉందని, ఈ విషయంలో కేంద్రం కూడా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. 120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చునన్నారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానంతో రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుందని, కేంద్రం సహకరిస్తే కేంద్రం సహకరించిందని తాము నిరభ్యంతరంగా చెబుతామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఒప్పుకునేందుకు తమకు ఎలాంటి భేషజాలు లేవన్నారు. తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్‌పోర్టులకు సంబంధించిన అనుమతులు వీలైనంత త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు.

**మాకు ఎలాంటి భేషజాలు లేవు : ఉప ముఖ్యమంత్రి భట్టి**

ఎలాంటి భేషజాలు లేకుండా, కేవలం రాష్ట్ర ప్రయోజనాలే ఏకైక లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన వాటాలను, నిధులను సాధ్యమైనంత వరకు సాధించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎంపీలు అందించిన ప్రతి సలహాను, సూచనను ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు నోట్ చేసుకున్నారని, వాటన్నింటినీ సాధ్యమైనంత త్వరగా పూర్తిస్థాయిలో అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖ కార్యదర్శితోపాటు సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వానికి వివిధ శాఖల కార్యదర్శులు, మంత్రులు, ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం రాసే ప్రతీ లేఖ ప్రతులను తప్పనిసరిగా తెలంగాణ భవన్ స్పెషల్ సెక్రటరీకి పంపాలని చెప్పారు. గతంలో పంపిన లేఖలు, భవిష్యత్తులో పంపే ఉత్తరాలు, పెండింగ్ అంశాలన్నింటినీ శాఖల వారీగా క్రోడీకరించి ఒక స్పష్టమైన డ్రాఫ్ట్ తయారు చేయాలని ఆదేశించారు. ఈ డ్రాఫ్ట్‌ను పార్లమెంట్ సమావేశాల సమయంలో ఎంపీలకు అందజేస్తారని, తద్వారా ఎంపీలు ప్రధానమంత్రిని, కేంద్ర మంత్రులను కలిసినప్పుడు రాష్ట్ర ప్రయోజనాలను వివరించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో ఎంపీలకు తక్షణ సమాచారం, సహకారం అందించేందుకు తెలంగాణ భవన్‌లో ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక టీమ్‌ను అందుబాటులో ఉంచుతుందని ప్రకటించారు. క్వశ్చన్ అవర్‌లో సప్లిమెంటరీ ప్రశ్నలు అడగడానికి అవసరమైన డేటాను ఈ టీమ్ అందిస్తుందన్నారు.

**ప్రజాస్వామ్య విలువలను బలంగా నమ్ముతాం**

కేంద్రం, రాష్ట్రాల్లో వేర్వేరు పార్టీల ప్రభుత్వాలు ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య వ్యవస్థలో 'ఫెడరల్ స్పిరిట' (సమాఖ్య స్ఫూర్తి), ప్రజాస్వామ్య విలువలను తాము బలంగా నమ్ముతామని డిప్యూటీ సీఎం అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని కలిసిన ప్రతి సందర్భంలోనూ ఒక పార్టీ తరఫున కాకుండా రాష్ట్ర ప్రభుత్వంగానే వెళ్తున్నామని ప్రకటించారు. రాష్ట్ర ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని, ప్రజాప్రభుత్వంలో భాగమైనా తాము రాజకీయాలు చేయడం లేదని చెప్పారు. వివిధ కార్యక్రమాల వల్ల సమావేశానికి రాలేకపోయిన ఇతర ఎంపీలను కూడా కలిసి ఈ సమన్వయ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని అధికారులను ఆయన కోరారు. భవిష్యత్తులో పార్లమెంట్ నోటిఫికేషన్ రాగానే ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేస్తామని, తద్వారా క్వశ్చన్ అవర్ కంటే ముందే ప్రశ్నలు పంపుకోవడానికి వీలవుతుందని డిప్యూటీ సీఎం చెప్పారు. ప్రస్తుత సమావేశాల నేపథ్యంలో క్వశ్చన్ అవర్, జీరో అవర్, స్టాండింగ్ కమిటీలు, కన్సల్టేటివ్ కమిటీల వంటివి అందుబాటులో ఉన్న ప్రతి ఫార్మాట్‌ను ఉపయోగించుకొని కేంద్రం దృష్టికి రాష్ట్ర అంశాలను తీసుకెళ్లాలని ఎంపీలను డిప్యూటీ సీఎం కోరారు. దీనితోపాటు అందరూ కలిసి డెలిగేషన్ లాగా వెళ్లి కేంద్ర మంత్రులను కలిస్తే దానికి ప్రాముఖ్యత ఉంటుందని, మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాలు జరిగే సమయంలో ముఖ్యమంత్రి గానీ, తాను గానీ స్వయంగా దిల్లీకి వస్తామని ప్రకటించారు. అక్కడ ఎంపీలతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఏయే అంశాలపై ఒత్తిడి తేవాలనే దానిపై చర్చిస్తామన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని బొగ్గు బ్లాకులను ఎలాంటి వేలం లేకుండా సింగరేణికే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిప్యూటీ సీఎం కోరారు. గతంలో ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించిన సత్తుపల్లి, కోయగూడెం 3 బ్లాకులను తిరిగి సింగరేణికి కేటాయించేలా ఈ సమావేశాల్లో ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్రంలోని అతిపెద్ద ప్రభుతరంగ సంస్థ అయిన సింగరేణిని బతికించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హైదరాబాద్‌కు సెమీకండక్టర్ వంటి భారీ ప్రాజెక్టు రావడం అనేది ఒక పెద్ద 'గేమ్ ఛేంజర' అవుతుందని భట్టి అభిప్రాయపడ్డారు. భవిష్యత్ అంతా సాంకేతికతపైనే ఆధారపడి ఉన్నందున, సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. జీఎస్టీ వచ్చినప్పటి నుంచి పన్నులన్నీ రాష్ట్రం నుంచి కలెక్ట్ అయి సెంట్రల్ పూల్‌కి వెళ్తున్నాయని, అక్కడినుంచే పంపిణీ జరుగుతోందని చెప్పారు. కాబట్టి కేంద్రం దగ్గరకు వెళ్లి రాష్ట్ర వాటాను మనం తెచ్చుకోవడం మినహా వేరే మార్గం లేదుని ఎంపీలతో భట్టి విక్రమార్క చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల క్లియరెన్సులకు సంబంధించిన పూర్తి డీటెయిల్డ్ ఇన్ఫర్మేషన్‌ను ఎంపీలకు అందిస్తామని చెప్పారు. అవసరమైతే రాష్ట్ర ఇరిగేషన్ మంత్రితో కలిసి అందరూ కేంద్రానికి రిప్రజెంట్ చేయాలని కోరారు. రైల్వే నెట్‌వర్క్ విస్తరణ వల్ల రాష్ట్రానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందించాల్సిన భూసేకరణ లేదా ఇతర సహకారాలను వంద శాతం అందించడానికి సిద్ధంగా ఉన్నామని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# షాబాద్ ఉన్మాది రాజ్‌కుమార్ ఆత్మహత్య!

షాబాద్/హైదరాబాద్, జూలై 13 :

రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ముగ్గురు ¾పిల్లలు సహా ఆరుగురిని కిరాతకంగా గొంతు కోసి హత్య చేసిన నరరూప రాక్షసుడు రాజ్‌కుమార్ కథ విషాదాంతమైంది. పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న ఈ ఉన్మాది చివరకు తన మేనమామ ఊరైన కొత్తూరు మండలం పంజర్లలో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్ లభ్యమైనట్లు తెలుస్తోంది. తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో రగిలిపోయిన రాజ్‌కుమార్ ఈనెల 10న అర్ధరాత్రి మూడు వేర్వేరు ప్రాంతాల్లో అత్యంత దారుణంగా ఆరుగురిని అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. మొదట షాబాద్ టౌన్‌లో మైనర్ బాలిక తల్లి, నాయనమ్మలను నరికి చంపాడు. ఆపై ఆ బాలికను అఖిల్ సాగర్ చెరువు వద్దకు తీసుకెళ్లి గొంతుకోశాడు. అంతటితో ఆగకుండా తన ఇంటికి వెళ్లి భార్య, ఇద్దరు కొడుకులను సైతం కిరాతకంగా బలిగొన్నాడు. ఈ ఘోర ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

**12 బృందాల గాలింపు.. రివార్డు ప్రకటన**

ఈ దారుణ ఉదంతాన్ని సవాల్‌గా తీసుకున్న పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు తెలంగాణ, కర్ణాటక సరిహద్దుల్లో 12 ప్రత్యేక



బృందాలతో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడిపై లుకౌట్ నోటీసులు జారీ చేయడమే కాక రూ.2 లక్షల రివార్డును కూడా ప్రకటించారు.

**ఆత్మహత్య డ్రామా.. చివరకు శవమై తేలి..**

ఆరుగురిని చంపిన తర్వాత 'నేను కూడా చనిపోతున్నా' అని రాజ్‌కుమార్ తన తండ్రికి ఫోన్ చేసినట్లు సమాచారం. మొదట తిమ్మాపూర్ రైల్వే ట్రాక్ వద్ద ఆత్మహత్య డ్రామా ఆడి పోలీసులను తప్పుదోవ పట్టించి తప్పించుకున్నాడు. కానీ చివరకు పంజర్లలో శవమై తేలాడు. దీంతో కేసు కీలక మలుపు తిరిగింది.

**బాలికను నమ్ముకుని అప్పలపాలయ్యా..**

**సెల్ఫీ వీడియోలో రాజకుమార్**

రంగారెడ్డి : షాబాద్‌లో ఆరు హత్యలకు ముందు రోజు హంతకుడు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడని ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. అతని మృతదేహం వద్ద లభించిన సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియోను గుర్తించినట్లు పేర్కొన్నారు. వీడియో రికార్డు వివరాల ఆధారంగా హత్యకాండకు ముందురోజు అంటే జులై 10న వీడియో రికార్డు చేసినట్లు గుర్తించామని చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన విషయాలను సీపీ తరుణ్ జోషీ మీడియాకు వెల్లడించారు. తాను అప్పులపాలయ్యానని, జీవితం మీద విరక్తి చెందినట్లు నిందితుడు ఈ వీడియోలో ఉందని అన్నారు. తన సంపాదనలో సగం వాళ్లకే పెట్టానని, తన దగ్గర డబ్బు వసూలు చేసి నష్టపరిచారని తెలిపాడన్నారు. తన పిల్లలకు భూమి లేకుండా చేసుకున్నానని. ఆ అమ్మాయిని నమ్మి అప్పుల పాలయ్యానని, చివరకు కేసు పెట్టి జైలుకు పంపాలని చూస్తున్నారని రాజ్‌కుమార్ వీడియో రికార్డ్ చేశాడని సీపీ వెల్లడించారు. 11 నుంచి 12 గంటల మధ్యలో ఆరు హత్యలు జరిగాయని సీపీ తరుణ్ జోషి చెప్పారు. రాజ్‌కుమార్ రూ.2 వేలకు కారు అద్దెకు తీసుకున్నాడని, ఘటన జరిగిన రోజు పదిన్నర గంటలకు ఊర్లోకి వచ్చాడని, అమ్మాయిని తీసుకుని దేవరకొండకు వెళ్లాడని చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు అలవాటు ఉండటంతో నిందితుడు 16 సిమ్ కార్డులు వాడాడని చెప్పారు. నిందితుడికి రూ.2 కోట్లకు పైగా అప్పు ఉందని, దానివల్ల మానసిక పరిస్థితి స్థిమితంగా లేదని చెప్పారు. కాలేజీ నుంచి వచ్చేటప్పుడు వెళ్లేటప్పుడు ఆ బాలికను వేధించాడన్నారు. అతనిపై పోక్సో కేసు ఉందని, తాజాగా ముందస్తు బెయిల్ వచ్చిందని వెల్లడించారు. షాబాద్‌లో బాలిక నానమ్మను చంపి అక్కడ నుంచి ఆమెను తీసుకుని దైవాలగూడ వెళ్లాడని సీపీ తరుణ్ జోషీ తెలిపారు. అక్కడ బాలిక, తన భార్యను, పిల్లలను నిందితుడు చంపేశాడని వెల్లడించారు. 11:37 గంటలకు తన తండ్రికి ఫోన్ చేసి ఆరుగురిని చంపేశానని, తాను ఆత్మహత్య చేసుకుంటానని రాజ్‌కుమార్ చెప్పాడని తెలిపారు. ఒంటిగంటకు హంతకుడి తండ్రి పోలీసులకు సమాచారం ఇచ్చారని చెప్పారు. ఈ ఘటన తర్వాత బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ తర్వాత నిందితుడిని పట్టుకునేందుకు పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయని, జీపీఎస్ ఆధారంగా రాజ్‌కుమార్‌ని పట్టుకునేందుకు యత్నించామని వివరించారు. క్లూస్ టీం సభ్యులు మృతదేహం లభించిన ప్రాంతాన్ని పరిశీలించారన్నారు. ఎన్నిగంటలకు రాజ్‌కుమార్ చనిపోయాడనేది క్లారిటీ లేదని తెలిపారు. పెంజర్లలో రాజ్‌కుమార్ మేనమామ ఉన్నారని తెలిపారు. నిందితుడికి సంబంధించిన నాలుగు కుటుంబాలు ఈ గ్రామంలోనే ఉంటున్నాయని సీపీ తరుణ్ జోషీ పేర్కొన్నారు.

# ఎల్-నినో ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధం

- రైతులు నష్టపోకుండా మూడు దశల ముందస్తు కార్యాచరణ
- ఇక్రిశాట్‌లో శాస్త్రవేత్తలతో మంత్రి తుమ్మల సమీక్ష
- కలెక్టర్లు, వ్యవసాయాధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశం

**హైదరాబాద్, జూలై 13:**

ప్రస్తుత ఎల్‌నినో ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్ ఇక్రిశాట్‌లో భారత వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్, సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధరంగ ఉన్నతాధికారులతో మంత్రి సోమవారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలను సమగ్రంగా పరిశీలించి, శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా తుది కార్యాచరణపై మంత్రి చర్చించారు. ముందుగా వివిధ సంస్థల శాస్త్రవేత్తలు ఎల్‌నినో పరిస్థితులను తట్టుకునేలా తాము సిద్ధం చేసిన కార్యచరణను మంత్రికి తెలియచేశారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమవడం, మధ్యలో దీర్ఘకాలిక పొడి పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని ఈనెల 15, 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపదికగా తీసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పరిస్థితులకనుగుణంగా జిల్లా వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈనెల 15 వరకు వర్షాలు ఆలస్యమైతే 16.30 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, 30 వరకు ఆలస్యమైతే 13.82 లక్షల క్వింటాళ్లు, ఆగస్టు 15 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే 12.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసి ముందుగానే అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇరిగేషన్, భూగర్భజల శాఖ, మిగతా శాఖల అధికారులు నీటి లభ్యత వివరాలు, విద్యుత్ సరఫరాకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను మంత్రికి వివరించారు. అన్ని జిల్లాల వర్షపాతం పరిస్థితులను ప్రభుత్వం రోజువారీగా సమీక్షించాలని ఆదేశించారు. 13 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా 20 జిల్లాల్లో లోటు ఉందన్నారు. వర్షాభావ జిల్లాల్లో కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. శాస్త్రీయ విధానాలతో ఎల్‌నినోను ఎదుర్కోవాలని, దీనికి సంబంధించి డైనమిక్ డిస్ట్రిక్ట్ స్పెసిఫిక్ రెస్పాన్స్(డీఎసఆర్) విధానాన్ని అమలు చేయాలని మంత్రి సూచించారు.

**మండలాల వారీగా వారపు బులెటిన్**

ఎల్‌నినోను ఎదుర్కోవాలంటే వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని మంత్రి తుమ్మల అన్నారు. భారత వాతావరణ శాఖ(ఐఎండీ), నీటిపారుదల, భూగర్భ జ□, విద్యుత్, వ్యవసాయ, ఉద్యాన శాఖలు సమన్వయంతో ప్రతి వారం మండలాల వారీగా సమగ్ర వ్యవసాయవాతావరణ బులెటిన్ విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు ఆఖరు వరకు ప్రతీ వారం విడుదల చేసే ఈ బులెటిన్‌లో మండలాల వారీగా నమోదైన వర్షపాతం, రాబోయే వారానికి, నెలాఖరు వరకు ఉండే వాతావరణ పరిస్థితుల అంచనాలు, డ్రై స్పెల్స్ ఏర్పడే అవకాశాలు, గరిష్ఠకనిష్ఠ ఉష్ణోగ్రతలు, నేల తేమ పరిస్థితులు, భూగర్భ జలాల లభ్యత, సాగునీటి పరిస్థితి, విద్యుత్ సరఫరా, పంటల స్థితి, రైతులు చేపట్టాల్సిన యాజమాన్య చర్యలతోపాటు నీటిపారుదల శాఖ ప్రాజెక్టుల క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో ఈ నెల, వచ్చే నెలకు సంబంధించిన వాతావరణ అంచనాలను విశ్లేషించి, ఆయా ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉండే నీటి నిల్వలు, ఇన్‌ఫ్లోలు, సాగునీటి లభ్యతపై ఖచ్చితమైన అంచనాలను కూడా బులెటిన్‌లో పొందుపరచాలని మంత్రి స్పష్టం చేశారు.

**శాస్త్రవేత్తల సూచనలు**

వర్షపాతం నమోదై భూమిలో తగినంత తేమ ఏర్పడిన తర్వాత మాత్రమే విత్తనాలు వేయాలని, బ్రాడ్ బెడ్ అండ్ ఫరో (బీబీఎఫ్) లేదా రిడ్జ్ అండ్ ఫరో పద్ధతులను అనుసరించాలని, భూమిలో తేమ ఏర్పడే వరకు ఎరువుల వినియోగాన్ని వాయిదా వేయాలని, నేల తేమను కాపాడేందుకు తరచూ ఇంటర్ కల్టివేషన్ చేపట్టాలని, వర్షాలు కురిసిన తర్వాత మాత్రమే సిఫార్సు చేసిన మోతాదులో నత్రజని, పొటాష్ ఎరువులు వేయాలని శాస్త్రవేత్తలు సూచించారు. పంటల కీలక ఎదుగుదల దశల్లో ప్రాణాధార నీటిపారుదల అందించడం, వరుస పంటల్లో స్కిప్ రో ఇరిగేషన్ అమలు చేయడం, దీర్ఘకాలిక పొడి పరిస్థితుల్లో 2 శాతం యూరియా లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని ఆకులపై పిచికారీ చేయడం, ప్రతి 3.6 మీటర్లకు ఒక డెడ్ ఫరో ఏర్పాటు చేసి వర్షపు నీటిని సంరక్షించడం, వ్యవసాయ కుంటల్లో నిల్వ చేసిన నీటిని అవసరమైన సమయంలో వినియోగించడం, అంతర పంటలను ప్రోత్సహించడం, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారని మంత్రి తెలిపారు.

**వరి రైతులకు ప్రత్యేక సూచనలు**

ప్రస్తుతం వరి పంట నారుమడి దశలో ఉన్న రైతులు నారు పీకడానికి వారం రోజుల ముందు ఎకరానికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3సీజీ గ్రాన్యూల్స్ వేయాలని, నాటే సమయంలో నారు ఆకుల చివరలను కత్తిరించి నాటాలని, 15/10 సెంటీమీటర్ల దూరంతో దగ్గరగా నాటి ప్రతి గుంతలో 68 మొక్కలు ఉంచాలని, సిఫార్సు చేసిన మోతాదుతో పోలిస్తే 25 శాతం అదనపు నత్రజని ఇవ్వాలని, మొత్తం నత్రజనిలో 70 శాతం నాటే సమయంలో, మిగిలిన 30 శాతం పూత ప్రారంభ దశలో వేయాలని మంత్రి అన్నారు. నీటి పొదుపు కోసం ఆల్టర్నేటివ్ వెట్టింగ్ అండ్ డ్రైయింగ్ (ఏడబ్ల్యూడీ) పద్ధతిని అమలు చేయాలన్నారు. నారు వేయని రైతులు తక్కువ కాలంలో పండే రకాలతో డ్రై డైరెక్ట్ సీడెడ్ రైస్ విధానాన్ని అనుసరించాలని సూచించారు. కాల్వల ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యతను బట్టి వరికి బదులు మొక్కజొన్న, సజ్జలు, రాగులు, కందులు, మినుములు, పొద్దుతిరుగుడు, నువ్వులు, అలసందలు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. మొక్కజొన్న, పత్తి పంటలు ప్రస్తుతం మొలక దశలో ఉన్నందున రాబోయే రెండు వారాల్లో వర్షాభావ పరిస్థితులు కొనసాగితే నేల తేమను కాపాడేందుకు కలుపు నియంత్రణ చర్యలు రైతులకు సూచించాలని మంత్రి తెలిపారు.

**విత్తనాల, ఎరువుల కొరత ఉండదు**

అవసరమైన విత్తనాలు, ఎరువులపై ఇప్పటికే సమగ్ర అంచనా వే□శామని మంత్రి తెలిపారు. మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలకు అనుగుణంగా అవసరమైన విత్తనాలను ముందుగానే సమీకరించామని, మార్క్‌ఫెడ్, విత్తన సంస్థలు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ రైతులకు కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ సెక్రటరీ సురేంద్రమోహన్, ఇక్రిశాట్ డిప్యూటి డైరెక్టర్ జనరల్ స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, కమిషనర్ కోఆపరేషన్ రాహుల్ రాజ్, హాకా ఎండీచంద్రశేఖర్, గిడ్డంగుల శాఖ ఎండీ లక్ష్మి, టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ పాటిల్, అగ్రి, హార్టికల్చర్ యూనివర్సిటీల వీసీలు జానయ్య, రాజిరెడ్డి, ఇక్రిశాట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ హరికిషన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు

- గోదావరి నీరు వృథాగా సముద్రంలోకి
- రైతులకు నీళ్లు ఇవ్వని రేవంత్ ప్రభుత్వం
- నీరు విడుదల చేయకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం
- ఎన్‌డీఎస్ ఏ వంకతో కాళేశ్వరం నీరు ఎత్తిపోయడంలేదు
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**కరీంనగర్, జూలై 13:**

తన అబద్ధాలు బయటపడతాయన్న ఏకైక కారణంతోనే ఒకవైపు గోదావరిలో నీరు భారీగా కిందికి వృథాగా పోతుంటే మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతన్నల గొంతు ఎండబెడుతూ, పంట పొలాలను ఎండబెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. కరీంనగర్ జిల్లాలోని మిడ్ మానేరు ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం పనికిరాదు అంటూ మాట్లాడిన రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలు. రిటైర్డ్ ఇంజనీర్లు. ఇరిగేషన్ నిపుణులు చేస్తున్న సూచనలు జీర్ణించుకోలేక వారిపై తిట్ల దండకం అందుకున్నారన్నారు. గత ప్రభుత్వంపైన, కాళేశ్వరం ప్రాజెక్టు పై గుడ్డి ద్వేషంతో నీళ్లు ఎత్తిపోయడం లేదన్నారు. ఇప్పటికైనా నీటిని ఎత్తిపోయకుంటే ప్రజలు కాంగ్రెస్‌ని తన్ని తరుముతారు అన్నారు. వెంటనే రైతన్నలు డిమాండ్ చేస్తున్న మేరకు కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ రాకముందు వరకు నిండుకుండలా ఉండేదని, కాంగ్రెస్ రాగానే మిడ్ మానేరు ఎండిపోతున్నది అన్నారు. కరువు ముంగిట నిలబడ్డ తెలంగాణకు కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోస్తే రైతన్నలకు ప్రజలకు సాగు, తాగునీటి సంక్షోభం లేకుండా చేయవచ్చు అన్నారు. రైతుల ప్రయోజనాలను పూర్తిగా విస్మరించి రాజకీయ కక్షసాధింపే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షాల సూచనలను పరిగణనలోకి తీసుకొని వెంటనే కాళేశ్వరం ద్వారా నీటిని ఎత్తిపోసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోతే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. గోదావరిలో వరద లేదని ముఖ్యమంత్రి ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ అబద్ధాలు చెబుతున్నారని, వాస్తవానికి టీఎంసీల కొద్దీ నీరు కిందికి పోతుండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అదే నీటిని ఎత్తిపోసుకుంటోందని కేటీఆర్ పేర్కొన్నారు. పక్క రాష్ట్ర ప్రయోజనాల కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కావాలనే తెలంగాణ రైతులకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. మేడిగడ్డ వద్ద లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నప్పటికీ మేడిగడ్డ గేట్లు దించకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా దాదాపు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ అవకాశం వినియోగించుకోవడం లేదన్నారు. ఈ విషయాలన్నీ తెలిసినా కేవలం బీజేపీ ఇచ్చిన అక్రమ ఎన్డీఎస్ఏ నివేదికను సాకుగా చూపిస్తూ పంటలను ఎండబెడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం నీటిని ఎత్తిపోసే విషయంలో కాంగ్రెస్ , బిజెపి కలిసి నాటకాలు ఆడుతున్నాయన్నారు. ఇప్పటికే తగిన మరమ్మతులు పూర్తి అయ్యాయని సాగునీటి శాఖ మంత్రి ఒకవైపు చెబుతున్నా మరోవైపు ఎన్ డిఎస్ ఏ రిపోర్ట్ పేరుతో అబద్ధాలు ఆడుతున్నారన్నారు. అది ముమ్మాటికి రాజకీయంగా రాసిన అబద్ధాల రిపోర్ట్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోయకపోవడం వల్ల లోయర్ మానేరు, మిడ్ మానేరు మాత్రమే కాక మొత్తం గోదావరి బేసిన్‌కు చెందిన అన్ని ప్రాజెక్టులు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల కారణంగా తీవ్రమైన వ్యవసాయ సంక్షోభంతో పాటు తాగునీటి సంక్షోభం కూడా తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎల్లంపల్లి నుంచి కూడా నీటిని ఎత్తిపోసే ప్రక్రియ నిలిచిపోవడంతో చివరికి హైదరాబాద్ నగరానికే తాగునీటి సంక్షోభం ఎదురయ్యే ప్రమాదం ఉందని కేటీఆర్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం నుంచి లోయర్ మానేరు ప్రాజెక్టులోకి నీటిని ఎత్తిపోయడం వల్ల కరీంనగర్ నగరానికి రోజూ తాగునీటి సరఫరా జరిగేదని, ప్రస్తుతం కరీంనగర్ ప్రజలు తాగునీటి కోసం కూడా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రిటైర్డ్ ఇంజనీర్లపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కేటీఆర్, కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధం లేకుండానే తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని సాగునీటి హక్కుల కోసం పోరాడిన సీనియర్ ఇంజనీర్లను అవమానించడం దురదృష్టకరమన్నారు. న్యాయమైన జలహక్కుల కోసం పోరాడిన వారి సేవలను ప్రజలు గుర్తుంచుకుంటారని చెప్పారు. 'కాళేశ్వరం నుంచి నీళ్లు ఎత్తిపోసాలంటే మా రక్తం కావాలి' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించిన నేపథ్యంలో 'మా రక్తం కావాలంటే తీసుకోండి.. కానీ రైతన్నలకు నీళ్లు ఇవ్వండి' అనే సందేశంతో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ప్రశాంత్ రెడ్డితోపాటు పార్టీ విద్యార్థి, యువజన విభాగాల కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున రక్తదానం చేసి ముఖ్యమంత్రికి పంపించిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల విషయంలో కూడా బీజేపీ ఇచ్చిన అక్రమ ఎన్డీఎస్ఏ నివేదికను ప్రభుత్వం సాకుగా చూపిస్తూ రైతులకు నీళ్లు ఇవ్వకుండా అడ్డుకుంటోందని ఆరోపించారు. 28.5 లక్షల క్యూసెక్కుల భారీ వరద ప్రవాహాన్ని తట్టుకున్న మేడిగడ్డతోపాటు ఇతర బ్యారేజీలు లక్ష క్యూసెక్కుల నీటిని కూడా తట్టుకోలేవని చెప్పడం పూర్తిగా అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాజకీయాలను పక్కనబెట్టి ప్రభుత్వం వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ముందస్తు సీట్ల లెక్కలు..
# కాంగ్రెస్-బీఆర్ఎస్ మైండ్ గేమ్

**హైదరాబాద్, జూలై 13**

తెలంగాణలో తదుపరి అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోటీ ఇప్పటి నుంచే వేడెక్కుతోంది. సర్వేల ఆధారంగా ఒకరిపై మరొకరు రాజకీయ ఆధిపత్యాన్ని చాటుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

**సర్వేల చుట్టూ రాజకీయ పోటీ**

ఇప్పుడే ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్ఎస్‌కు 78 అసెంబ్లీ స్థానాలు దక్కుతాయని, ప్రభుత్వ అంతర్గత సర్వేల్లో కూడా ఇదే విషయం వెల్లడైందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. దీనికి ప్రతిస్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ 117 స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీశాయి.

**క్యాడర్‌కు భరోసా కల్పించే ప్రయత్నం**

ఇటీవలి ఎన్నికల్లో ఎదురైన పరాజయాలు, పలువురు నేతలు పార్టీని వీడడం వంటి పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ప్రజల మద్దతు తమకే ఉందనే సందేశాన్ని కాంగ్రెస్ నాయకత్వం బలంగా వినిపిస్తోంది. రెండు పార్టీలూ తమ కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు ఈ ప్రకటనలను వినియోగిస్తున్నట్లు పరిశీలకులు చెబుతున్నారు.

**రాజకీయ వ్యూహాలే ప్రధాన ఆకర్షణ**

ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పార్టీకి ఎన్ని స్థానాలు వస్తాయనే అంశంపై ఇప్పుడే స్పష్టమైన అంచనాకు రావడం సాధ్యం కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల నాటికి మారే రాజకీయ పరిస్థితులు, ప్రజాభిప్రాయం ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ సర్వేల పేరిట సాగుతున్న ఈ రాజకీయ మైండ్ గేమ్ తెలంగాణ రాజకీయాలను మరింత ఆసక్తికరంగా మార్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## అధికారుల సమస్యలపై సత్వర నిర్ణయం తీసుకోండి

మొదటిపేజీ తరువాయి

రిలేటెడ్ పేమెంట్ (పీఆర్‌పీ) అమలుకు సంబంధించి అధికార సంఘం నాయకులు చేసిన విజ్ఞప్తులను ప్రాధాన్యంగా పరిగణించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చొరవతో తాడిచర్ల2 బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరు కావడంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పోషించిన కీలక పాత్రకు కృతజ్ఞతలు తెలుపుతూ సింగరేణి అధికార సంఘం నాయకులు ఆయనను సోమవారం కలిశారు. ఈ సందర్భంగా తమక" సంబంధించిన వివిధ సమ్మస్త్రఅ□లను త్వరగా పరిష్కరించేలా సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయాలని ఆయనను కోరారు.ఈ విజ్ఞప్తులపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క సోమవారం ఉదయం సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ (పర్సనల్ & ఫైనాన్స్) శ్రీ గౌతమ్ పోట్రుతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం సింగరేణి అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఇంధన భద్రతను అందించడంలో సింగరేణి కార్మికులు, అధికారులు విశేష కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారుల్లో ఎలాంటి అసంతృప్తి నెలకొనకుండా వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికార సంఘం నాయకులతో చర్చించి వారికి భరోసా కల్పించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా రానున్న రెండు, మూడు నెలల్లో అధికారుల విజ్ఞప్తులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా మారుతున్న ప్రపంచీకరణ పరిస్థితులు, పెరుగుతున్న పోటీని దృష్టిలో ఉంచుకొని బొగ్గు ఉత్పత్తి, విక్రయాల్లో సింగరేణి పోటీతత్వాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిని బహుముఖ రంగాల్లో విస్తరించి అంతర్జాతీయస్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు అధికారులు కీలక పాత్ర పోషించాలని, ఈ దిశగా అధికార సంఘం నాయకులు కూడా అధికారుల్లో సానుకూల దృక్పథం, కార్యోన్ముఖత పెంపొందించేలా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు.

**ఉప ముఖ్యమంత్రికి అధికార సంఘం నాయకుల కృతజ్ఞతలు**

సింగరేణి సుస్థిర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనకు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సింగరేణి అధికార సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవలే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి తమ సమస్యలను వివరించామంటూ దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సత్వరమే పరిష్కరించాలని యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయడంపై ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి అభివృద్ధి, విస్తరణ, సుస్థిర భవిష్యత్ కోసం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి అధికారుల తరపున సంపూర్ణ మద్దతు అందిస్తూ, సంస్థ పురోగతి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు.

## సుప్రీం కోర్టు సాక్షిగా బయటపడ్డ రేవంత్ వైఫల్యం

**సంగారెడ్డి, జూలై 13:**

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు సుప్రీంకోర్టు సాక్షిగా బయటపడ్డాయని మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మొదటి నుంచి రాజకీయ కాంక్ష తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని ధ్వజమెత్తారు. తన రాజకీయ గురువు చంద్రబాబు కి గురుప్రదక్షిణ చెల్లించుకునేందుకే సీఎం రేవంత్ ఆరాటపడుతున్నారని విమర్శించారు. గోదావరి, నల్లమల కేసులో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి మొట్టికాయలు వేసిందని, కావాలనే లోపాలతో కూడిన కేసును వేయడం వల్లే ఈ కేసు నిలువదని ఉన్నత న్యాయమూర్తులు చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో చేస్తున్నట్లు చూపించుకోవడానికి కేవలం బ్యాక్ డేట్ ఉత్తరాలు రాసిందని ఎద్దేవా చేశారు. గోదావరి బనకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని మొదటి నుంచి బీఆర్ఎస్ మొత్తుకుంటూనే ఉందని హరీష్ రావు తెలిపారు. చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కు అయ్యారని చెప్పడానికి ఇంకేం ఆధారాలు కావాలి? 'నువ్వు కొట్టినట్టు చెయ్.. నేను తిట్టినట్టు చేస్తా' అన్నట్లుగా రేవంత్ డ్రామాలు ఆడుతున్నారు. రేవంత్ కేవలం ఉద్యమ ద్రోహినే కాదు, తెలంగాణకు జలద్రోహిగా కూడా మారిపోయారు' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బనకచర్లపై సమావేశానికి వెళ్లనని చెప్పిన రేవంత్, ఆ తర్వాత దొంగచాటుగా వెళ్లారని ఆరోపించారు. పైగా చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తుడైన, తెలంగాణ ద్రోహి అయిన ఆదిత్యనాథ్ దాస్‌ను కమిటీలో ఎలా నియమిస్తారని నిలదీశారు. రేవంత్ రెడ్డికి జలవనరులపై అవగాహన తక్కువ, ఆవేశం ఎక్కువ అని హరీష్ రావు ఎద్దేవా చేశారు. గోదావరి నల్లమల సాగర్‌పై ఆంధ్రప్రదేశ్ టెండర్లను 11 డిసెంబర్ 2025 నాడే పూర్తి చేసిందని, దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం 16 డిసెంబర్ 2025న రిట్ పిటిషన్ వేసిందని హరీష్ రావు గుర్తుచేశారు. అది డిస్మిస్ అయిన తర్వాత గత 7 నెలలుగా ఈ ప్రభుత్వం ఏం చేస్తూ తమాషాలు చేస్తోందని ప్రశ్నించారు. నిన్న మొన్నటి వరకు రివ్యూలు చేయాల్సిన పాలకులు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్‌పై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటకలో ముగ్గురు సీఎంల అజెండా ఏంటో రేవంత్ రెడ్డి బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 'ఎన్ఓసీ' పేరిట తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ ఏపీకి అమ్ముకుంటున్నారని, దీనిపై అసెంబ్లీని సమావేశపరిచి చర్చ జరపాలని, దొంగచాటుగా వ్యవహారాలు నడిపితే తాము ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బనకచర్ల విషయంలో రేవంత్ తీరు అనుమానాస్పదంగా ఉందని, అందుకే ఇవాళ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ సమావేశానికి వెళ్లలేదని పేర్కొన్నారు. తమ పార్టీ క్షేత్రస్థాయిలో గట్టిగా ప్రశ్నించడం వల్లే ప్రభుత్వం దిగివచ్చి దేవాదుల మోటర్లను ఆన్ చేసిందని హరీష్ రావు స్పష్టం చేశారు. అయితే అక్కడ 2500 క్యూసెక్కుల నీటిని ఎత్తాల్సి ఉండగా 6 మోటర్లను మాత్రమే నడుపుతున్నారని విమర్శించారు. సమ్మక్క బ్యారేజీలో నీరు నిల్వ చేసుకుంటే పంపింగ్ చేసుకోవచ్చని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చాలా ముద్దుగా చెబుతున్నారని ఎద్దేవా చేశారు. అసలు ఆ సమ్మక్క బ్యారేజీని నిర్మించింది ఎవరో భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని, కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులను వాడుకోవడం కూడా చేతకాక కాంగ్రెస్ నేతలు కాలయాపన చేస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు.



Time& Calendars

### బనకచర్లపై నోటీసులు ఇవ్వడం కుదరదు : తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూలై 13: పోలవరం, గోదావరి నీటి వినియోగం, బనకచర్ల అనుసంధానం అంశా పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ వేసిన పిటిషన్పై జస్టిస్ విక్రమ్నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలని, ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్లో కోరగా ప్రభుత్వ అభ్యర్ధనను సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రధాన పిటిషన్లో లోపాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. లోపాలు సరిదిద్దే వరకు విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. 15 మంది ప్రతివాదులు ఉన్నారని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. లోపాలు సరిదిద్దాక విచారణలో మిగతా అంశాలు పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. పిటిషన్పై విచారణ జరపకుండా నోటీసులివ్వలేమని తెలిపింది. బనకచర్ల ప్రాజె క్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖ లు చేసిన పిటిషన్పై సుప్రీంకోర్టులో కీలక మపరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయా లన్న తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు నిరాకరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా, ఈ పిటిషన్ నిబంధనలకు విరుద్ధంగా లిస్ట్ అయ్యిందంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒ రిజినల్ సూట్ విషయంలో నిబంధనల ప్రకా రమే విచారణకు రావాలని స్పష్టం చేసింది. రిజిస్ట్రీ రూల్స్ ప్రకారం ఇటువంటి ఒరిజినల్ సూట్ పిటిషన్ ను ముందుగా చాంబర్ జడ్జి ముందు దాఖలు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆ పక్రియ పూర్తికాక ముందే ప్రతివాదులకు నోటీసులు ఇవ్వకుండా నేరుగా బెంచ్ ముందుకు విచారణకు రావడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. అయితే అప్ప టివరకు ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని తెలంగాణ చేసిన వాదననూ సుప్రీంకోర్టు పట్టించుకోలేదు.



# గ్రామాల అభివృద్ధి పట్టని పాలకులు!

పల్లె కన్నీరు పెడుతోంది. మంచినీటి కోసం కన్నీరు పెడుతోంది. సాగునీటి కోసం రైతన్న కన్నీరు పెడుతున్నాడు. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్దరించామన్న పెద్దమనుషులు గ్రామాలకు వస్తే..చెరువులు ఎలా ఉన్నయో కనిపిస్తాయి. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్దరణ కార్యక్రమం అంతా బోగస్. ఎక్కడా చెరువుల పునరుద్దరణ జరగలేదు. జరిగితే ఇవాళ చెరువుల్లో నీటి చుక్కకూడా లేకుండా పోదు. వర్షాలు వెనక్కి పోవడంతో గ్రామాల్లో మంచినీటి సమస్యల తరుముకు వస్తోంది. పట్టణాల్లో ఇప్పుడిప్పుడే మళ్లీ ట్యాంకర్లు తిరుగుతున్నాయి. దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం వల్ల భూగకభ జలాలు వట్టి పోయాయి. తాత్కాలిక చర్యలతో ప్రభుత్వాలు ఏళ్లుగా కాలయాపన చేస్తూ వచ్చాయి. ఈ క్రమంలో ఏళ్లుగా గ్రామాలు కునారిల్లుతున్నాయి. కనీస వసతులు లేవు. గ్రామాల అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధికి అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. అమరావతి పేరుతో ఎపిలో గ్రామాలను పట్టించు కోవడం లేదు. బలవంతంగా రైతుల నుంచి భూములు లాక్కుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. పంటలు వేసుకున్న పొలాలను జెసిబిలతో దున్నుతూ రైతులను వీధుల్లో పడేస్తున్నారు. వారికి గౌరవప్రదమైన పరిహారం కూడా చెల్లించడం లేదు. చంద్రబాబు నిరంకుశ విధానాలకు ఇది పరాకాష్టగా నిలుస్తోంది. తెలంగాణో ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుద్దరణ వంటి వాటికి ఇస్తున్న ప్రాధాన్యం గ్రామాలకు దక్కడం లేదు. దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ప్లాస్టిక్ భూతంలా వెన్నాడుతోంది. పర్యావరణం దెబ్బతింటోంది. మొక్కలు నాటడం లేదు. కోతులను తరమడం లేదు. భూగర్భ జలాలను పెంచే ప్రయత్నాలు సాగడం లేదు. ఈ సమస్యలన్నీ పరిష్కరించలేని వేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. ప్రజల భాగస్వామ్యంతోనే ఇవన్నీ సాధ్యం. అలాగే ప్రజలను బాధ్యులుగా కూడా చేయాలి. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు బాధ్యులను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను పురోగించేలా చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపతేం చేస్తూ పోవాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యవసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అభివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. ఎందుకంటే రోడ్డురవాణాను విస్తరిస్తే గ్రామాలు వాటంతట అవే పురోగమిస్తాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తే హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గుతంది. పదిశాతం దృష్టి గ్రామాలపై పెట్టినా అవి అల్లుకు పోతాయి. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పటు గ్రామాలు పురోగమిస్తాయి. చైనా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా వంటి దేశాలతో పోటీపడటం... తప్పు లేదు. అందుకు తగ్గట్లుగా గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయగలిగితేనే ఇది సాధ్యం అవుతుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయ రంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి నిచ్చెనగా మారగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని స్థానిక వనరులను ఉపయోగించుకుంటే అభివృద్ధికి దోహదపడగలదు.చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. ఓవైపు రాష్ట్రమంతటా ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. అప్పుడప్పుడు మబ్బులే తప్ప వానలు పడటం లేదు. ఒక్కోరోజు వాతావరణం ఎండాకాలాన్ని తలపి స్తున్నది. పంటలు సాగు చేసేందుకు రైతులు వెనుకాడుతున్న పరిస్థితి కనపడుతోంది. గతేడాది కంటే ప్రస్తుతం రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గనుంది. దేశంలో పంటల సాగుపై ఎల్ నినో తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నది. ఎల్ నినో తీవ్ర రూపం దాల్చడంతో వానలు కరువయ్యాయి. మబ్బులే తప్ప చినుకు జాడలేదు. ఇప్పటివరకు రాష్ట్రంలో 21శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్‌లో చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలుపడలేదు. జూలై సగం నెల గడుస్తున్నా వానలు ముఖం చాటేసాయి. ఈ నెలలోనూ వర్షాలు కురువకపోవచ్చనే అంచనాలను వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నది. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలు వేసేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు. ఒకవేళ ముందుగానే పంటలు వేస్తే తర్వాత వర్షాలు కురువకపోతే పెట్టుబడి నష్టపోయే ప్రమాదం ఉంటుందని రైతులు భయపడుతున్నారు. దీంతో పంటలు సాగు చేసేందుకు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఇదంతా కూడా గ్రామాల్లో వాననీటిని ఒడిసి పట్టకపోవడం వల్ల జరిగిన నష్టంగా గుర్తించాలి. ఇప్పటికైనా గ్రామాల్లో తాగు, సాగునీటి ప్రాజెక్టును పునరుద్దరించడం ద్వారా అభివృద్ధికి అడుగులు వేయాలి.

# ఐక్యరాజ్యసమితి ఛార్టర్ ఉల్లంఘనలు

- ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచుతున్న అమెరికా
- తాజా దాడులపై మండిపడ్డ ఇరాన్




**టెహ్రాన్, జూలై 13 :** పశ్చిమాసియాలో యుద్ధం ఆగినట్టే కనిపించినా.. ఇటీవల మళ్లీ ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్, అమెరికా పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే హర్మూజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఐఆర్‌జీసీ దాడులు చేయడం తాజా ఉద్రిక్తతలకు మరింత ఆజ్యంపోసింది. అమెరికా జరిపిన తాజా సైనిక దాడులపై ఇరాన్ తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ దాడులను ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను స్పష్టంగా ఉల్లంఘించడమేనని అభివర్ణించిన ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ, వాషింగ్టన్ చర్యలు ప్రాంతీయ స్థిరత్వాన్ని, కాల్పుల విరమణ ఒప్పందాన్ని దెబ్బతీస్తున్నాయని ఆరోపించింది. ఇది ముమ్మాటికీ ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచడమేనని ఆరోపించింది. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన విడుదల చేస్తూ, అమెరికాకు సహకరించే దేశాలకు ఇరాన్ గట్టి హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా తమపై దాడులు చేయడానికి ఏ దేశమైనా తన భూభాగాన్ని లేదా సదుపాయాలను ఉపయోగించుకోవడానికి అనుమతిస్తే, ఆ దేశాలను కూడా తాము శత్రువులుగానే పరిగణిస్తామని ఇరాన్ స్పష్టం చేసింది. 'ఇరాన్‌పై సైనిక దాడులు చేయడానికి ఏ దేశ భూభాగం లేదా సదుపాయాలు ఉపయోగించినా, దానిని దురాక్రమణకు మూలంగా పరిగణిస్తాం. ఇరాన్ సాయుధ దళాల రక్షణాత్మక చర్యల్లో భాగంగా వాటిని చట్టబద్ధమైన లక్ష్యాలుగా చూస్తాం'. అని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఇటీవల మస్కట్‌లో జరిగిన చర్చల ఫలితాలపై అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను ఇరాన్ పూర్తిగా తోసిపుచ్చింది. వాటిని 'పచ్చి అబద్ధం' గా తేల్చింది. మస్కట్ చర్చలు కేవలం హోర్మూజ్ జలసంధి నిర్వహణ, అంతర్జాతీయ షిప్పింగ్ మార్గాల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లపైనే జరిగాయని, అమెరికా అధ్యక్షుడు చిత్రీకరిస్తున్నట్లుగా కాదని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికా జరిపిన సైనిక చర్యలపై ఐక్యరాజ్యసమితి సెక్రటేరియట్ స్పందించిన తీరు సరిగ్గా లేదని ఇరాన్ విమర్శించింది. అంతర్జాతీయ చట్టాలను, ఐరాస చార్టర్‌ను ఉల్లంఘించిన అమెరికాను జవాబుదారీగా చేయాలని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, భద్రతా మండలిని ఇరాన్ కోరింది. హోర్మూజ్ జలసంధి గుండా వెళ్లే వాణిజ్య నౌకలు, పౌరులపై దాడులు చేసే ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం ఇరాన్‌పై సరికొత్త సైనిక దాడులను ప్రారంభించింది. అంతకుముందు శనివారం కూడా అమెరికా దళాలు ల్యాండ్, సీ-బేస్డ్ ÷టైర్ ఎయిర్‌క్రాఫ్ట్, డ్రోన్లు, నౌకాదళ నౌకల ద్వారా దాదాపు 140 ఇరాన్ సైనిక లక్ష్యాలపై కచ్చితమైన దాడులు చేశాయి. ఇందులో ఇరాన్ క్షిపణి, డ్రోన్ సైట్లు, నౌకాదళ సామర్థ్యాలు, మందుగుండు సామగ్రి నిల్వ కేంద్రాలు, తీర నిఘా ప్రాంతాలు ఉన్నాయి. అమెరికా దాడుల అనంతరం దక్షిణ ఇరాన్ నగరాలైన జాస్క్, బందర్ అబ్బాస్, సిరిక్‌లలో మూడు భారీ పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ ప్రెస్ టీవీ ధృవీకరించింది. మరోవైపు, ఇరాన్-అమెరికా మధ్య పెరుగుతున్న సైనిక ఘర్షణలపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉద్రిక్తతలు ప్రాంతీయంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని ఆయన హెచ్చరించారు.

# పౌరసత్వ నిర్ధారణలో పారదర్శకత ముఖ్యం

**న్యూఢిల్లీ, జూలై 13 :** పౌరసత్వాన్ని నిర్ధారించే లేదా ఒక వ్యక్తిని విదేశీయుడిగా ప్రకటించే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, న్యాయబద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అస్సాం లోని ఫారినర్స్ ట్రిబ్యునళ్లు 'విదేశీయులు'గా ప్రకటించిన 27 మంది వ్యక్తుల పౌరసత్వ స్థితిపై సోమవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు కీలక తీర్పునిచ్చింది. 'పౌరసత్వం, విదేశీయుడి హోదా అనేవి అత్యున్నత రాజ్యాంగ, చట్టపరమైన ప్రాముఖ్యత కలిగిన అంశాలు' అని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. అక్రమంగా పౌరసత్వం పొందాలని చూసే వారిని నిరోధించడంలో ప్రభుత్వానికి స్పష్టమైన ప్రయోజనాలు, బాధ్యతలు ఉంటాయనే విషయాన్ని సుప్రీంకోర్టు అంగీకరించింది. 'చట్టబద్ధంగా అర్హత లేని వ్యక్తులు.. తప్పుడు పత్రాలు, తప్పుడు క్లెయిమ్‌ల ద్వారా భారతీయ పౌరసత్వాన్ని పొందకుండా చూసేందుకు ప్రభుత్వానికి చట్టబద్ధమైన, బలమైన ఆసక్తి ఉంటుంది. అయితే, తుది విశ్లేషణలో ఆ ఆసక్తి లేదా ప్రయోజనం.. న్యాయబద్ధమైన పక్రియను అధిగమించలేవు'. అని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి

- అసోంలో 27మంది వ్యక్తుల పౌరసత్వంపై విచారణ
- వారిపై బలవంతపు చర్యలు తీసుకోరాదన్న సుప్రీం



గతంలో గౌహతి హైకోర్టు, ఫారినర్స్ ట్రిబ్యునళ్లు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. ట్రిబ్యునళ్లలో ఈ కేసుపై మరోసారి విచారణ జరిగే వరకు ఆ 27 మంది వ్యక్తులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. అయితే, పిటిషనర్ల పౌరసత్వాన్ని నిర్ధారించడానికి తాము ఇంకా ఎటువంటి ఆధారాలను పూర్తిగా పరిశీలించలేదని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టును ఆశ్రయించిన వారిలో సాబిత్రి దేయ్, అజ్బహర్ అలీ, ఎండీ అక్బర్ అలీ, అబేదా ఖాతూన్, అనోవారా ఖాతూన్ అనే వ్యక్తులు ఉన్నారు. పాత ఓటర్ల జాబితాలో పేర్ల స్పెల్లింగ్స్ తప్పుగా పడటం, చిన్న చిన్న తేడాలు ఉండటం వంటి సాంకేతిక కారణాల వల్లే తమను విదేశీయులుగా ప్రకటించారని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తాము భారతీయ పౌరులమేనని నిరూపించుకోవడానికి 1971 కంటే ముందు నాటి లెగసీ డేటా, ఓటర్ల జాబితాలు, భూమి రికార్డులను వారు కోర్టుకు సమర్పించారు. కాగా, గత జూన్ నెలలో కూడా ఇలాంటి ఒక కేసులోనే.. ఐదుగురు మహిళలను విదేశాలుగా బహిష్కరించకుండా సుప్రీంకోర్టులోని మరో బెంచ్ అడ్డుకుంది. అవసరమైన అన్ని పత్రాలు సమర్పించినప్పటికీ, కేవలం పేర్ల స్పెల్లింగ్స్‌లో తేడాలు ఉన్నాయనే కారణంతో వారిని విదేశీయులుగా ప్రకటించారని అప్పట్లో కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజా తీర్పుతో అస్సాంలోని ఫారినర్స్ ట్రిబ్యునళ్లు పౌరసత్వ క్లెయిమ్‌లలను పరిశీలిస్తున్న తీరు, వారి ప్రమాణాలపై దేశవ్యాప్తంగా చట్టపరమైన చర్చ మొదలైందని నిపుణులు భావిస్తున్నారు.

# గోవధ నిషేధంపై మద్రాస్ హైకోర్టు తీర్పుపై స్టే

## తీర్పుకు సవరణ అవసమన్న సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జూలై 13 :** తమిళనాడులో గోవధను పూర్తిగా నిషేధిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పుకు 'సవరణ' అవసరమని పేర్కొంటూ, ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం పెద్ద ఊరటనిచ్చింది. బక్రీద్ పండుగ సందర్భంగా లేదా మరే ఇతర రోజుల్లోనైనా రాష్ట్రంలో ఆవులు, దూడల వధ జరగకుండా చూడాలంటూ మే 27న మద్రాస్ హైకోర్టు తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ విజయ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం తన వాదనలను వినిపించింది. రాష్ట్రంలో అమలులో ఉన్న చట్టం ప్రకారం.. కొన్ని నిర్దిష్ట కేటగిరీల ఆవులను, అనుమతించిన ప్రాంతాలలో వధించడానికి చట్టబద్ధమైన అనుమతి ఉందని ప్రభుత్వం పేర్కొంది. 'చట్టంలోని నిబంధనలు ఓ నిర్దిష్ట పక్రియకు అనుమతిస్తున్నప్పుడు, దానికి విరుద్ధంగా కోర్టులు న్యాయపరమైన ఆదేశాలు జారీ చేయడం చట్టబద్ధంగా చెల్లదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదించింది. మద్రాస్ హైకోర్టుకు చెందిన జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్, జస్టిస్ వి. లక్ష్మీనారాయణతో కూడిన ధర్మాసనం.. ఆగస్టు 1976 నాటి ఓ ప్రభుత్వ ఉత్తర్వును (ఉక్ష) ఆధారంగా చేసుకుని ఈ నిషేధాన్ని విధించింది. పాల ఉత్పత్తిని పెంచడానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి 1976లో గోవధను నిషేధిస్తూ ఆ ఉత్తర్వు ఇచ్చారు. తీర్పును రాసిన జస్టిస్ స్వామినాథన్.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 48 ప్రకారం ఆవులు, దూడలు, ఇతర పాడి పశువుల వధను నిషేధించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిషత్ చర్చల్లో కూడా శ్రీకృష్ణుని కాలం నుంచి ఆవు మన నాగరికతతో ముడిపడి ఉన్న అత్యంత గౌరవనీయమైన జంతువుగా పేర్కొన్నారని ఆయన గుర్తుచేశారు. తమిళనాడులో సంప్రదాయకంగా బక్రీద్ పండుగ సమయంలో ముస్లింలు స్థానిక నిబంధనలకు లోబడి ప్రైవేట్ ప్రాంగణాల్లో లేదా మతపరమైన ప్రార్థనా స్థలాలలో జంతు బలులు ఇస్తారు. అలాగే, రాష్ట్రంలోని పలు హిందూ దేవాలయాలలో జరిగే వార్షిక ఉత్సవాల్లో కూడా జంతు బలులు ఇచ్చే సంప్రదాయం ఉంది. ఇటువంటి బలులను కేవలం లైసెన్స్ పొందిన కసాయ్‌ఖానాలకే పరిమితం చేయడం ఆచరణాత్మకంగా సాధ్యం కాదని, పండుగ రద్దీని తట్టుకునే సామర్థ్యం ఆయా కేంద్రాలకు లేదని కమ్యూనిటీ నాయకులు వాదిస్తున్నారు. తమిళనాడు ప్రభుత్వం తమ రాష్ట్రంలో 'తమిళనాడు జంతు సంరక్షణ చట్టం' ఇతర నియంత్రణ నిబంధనలు ఇప్పటికే అమలులో ఉన్నాయని స్పష్టం చేసింది. జంతువులను ఎక్కడ, ఏ పరిస్థితులలో వధించాలనే దానిపై స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని, అయితే పూర్తి నిషేధం చట్టంలో లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతానికి సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో తమిళనాడులో ఈ వివాదానికి తాత్కాలిక బ్రేక్ పడింది.

# పేపర్ లీక్‌లపై రాహుల్ గాంధీ మండిపాటు

## విద్యా వ్యవస్థ దోపిడీ యంత్రాంగంగా మారిందని విమర్శ

## 'ఛాత్రోన్ కీ గూంజ్'లో విద్యార్థులు పాల్గొనాలని పిలుపు

**న్యూఢిల్లీ, జూలై 14 :** దేశంలో వరుసగా జరుగుతున్న ప్రశ్నపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవినీతిపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. భారత విద్యా వ్యవస్థ ప్రస్తుతం నిజాయతీ లేని దోపిడీ యంత్రాంగంగా మారిందని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. భారత విద్యా వ్యవస్థ గురించి తాను చేస్తున్న వ్యాఖ్యలు తన వ్యక్తిగత అభిప్రాయాలు కావని, దేశవ్యాప్తంగా విద్యార్థులు వ్యక్తం చేస్తున్న ఆవేదననే తాను ప్రతిబింబిస్తున్నానని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేయాల్సిన వ్యవస్థ వారిని, వారి కుటుంబాలను అప్పులు, మానసిక ఒత్తిడి, నిరాశల వైపు నెడుతోందని విమర్శించారు. దేశంలో కొనసాగుతున్న అవినీతే ప్రశ్నపత్రాల లీక్ మాఫియాకు ప్రధాన కారణమని రాహుల్ ఆరోపించారు. పోటీ పరీక్షల కోసం సంవత్సరాల పాటు కష్టపడుతున్న లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ఈ మాఫియా ఒక్కసారిగా నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ఈ అంశంపై మౌనం వహిస్తున్నారని విమర్శించారు. జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికే కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. అలాగే ఈ అంశాన్ని ప్రశ్నించాల్సిన మీడియా కూడా దీర్ఘకాలంగా మౌనంగా ఉందని వ్యాఖ్యానించారు.

### 'ఛాత్రోన్ కీ గూంజ్'లో పాల్గొనాలని పిలుపు

దేశ విద్యా రంగంలో సమూల మార్పులు అవసరమని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో విద్యార్థులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. జూలై 17న డెహ్రాడూన్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థుల సమస్యలను మరింత బలంగా వినిపిద్దామని కోరారు. కార్యక్రమానికి సంబంధించిన నమోదు వివరాల లింక్‌ను కూడా తన 'ఎక్స్' పోస్టులో పంచుకున్నారు.

# ప్రైవేటు పాఠశాలలకు చట్టపరమైన రక్షణ అవసరం




**రామంతపూర్, జులై 14,( రాజముద్ర న్యూస్ ):** విద్యాసంస్థలు సమాజ నిర్మాణానికి పునాదులు. అలాంటి పాఠశాలలపై ఎవరైనా ఆధారాలు లేకుండా ఫిర్యాదులు చేయడం, బెదిరింపులు, అనవసర ఒత్తిళ్లు తీసుకురావడం విద్యా వాతావరణాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడడమే కాకుండా, చట్టబద్ధంగా పని చేస్తున్న పాఠశాలల హక్కులను కూడా ప్రభుత్వం రక్షించాల్సిన బాధ్యత కలిగి ఉంది. కొంతమంది వ్యక్తులు కావాలనే ప్రైవేట్ పాఠశాల పైన, యాజమాన్యాల పైన కక్షతో అనవసరమైన ఫిర్యాదులు చేస్తూ సంబంధిత అధికారులని చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేస్తూ లేదంటే పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని అధికారులను బెదిరిస్తూ ఈ విషయాన్ని ముందు పెడుతూ యాజమాన్యాల పైన బలవంతంగా వసూలు చేస్తున్నారు లేదంటే మీ యొక్క పాఠశాలను సీజ్ చేపిస్తామని బెదిరిస్తున్నారు ఈ విధమైన ఒత్తిళ్లకు పాల్పడుతూ డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారు ఇటువంటి అవినీతి వ్యక్తుల పైన అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా చట్టాలు తీసుకురావాలని కోరుతున్నారు ఏ పాఠశాలపై నైనా ఫిర్యాదు వచ్చినప్పుడు, వెంటనే శిక్షాత్మక చర్యలకు వెళ్లకుండా సంబంధిత అధికారులు, అవసరమైతే పోలీసులు కూడా పరిస్థితిని శాంతియుతంగా నిర్వహించి, పాఠశాల ఆస్తి, విద్యార్థుల భద్రత మరియు సిబ్బంది రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నాలు, బెదిరింపులు, అక్రమంగా పాఠశాలల్లోకి ప్రవేశించడం వంటి చర్యలను నిరోధించడం పోలీసుల బాధ్యత. అదే సమయంలో, విద్యార్థులు, తల్లిదండ్రులు లేదా ఇతర పౌరులు చేసే నిజమైన, ఆధారాలతో కూడిన ఫిర్యాదులను పరిశీలించే హక్కు కూడా తప్పకుండా ఉండాలి. కాబట్టి పాఠశాలలకు రక్షణ కల్పించే చట్టం తీసుకురావాలంటే, అది ఒకవైపు నిరాధార వేధింపులను అరికట్టాలి; మరోవైపు నిజమైన ఫిర్యాదులను అణచివేయకుండా సమతుల్యతను పాటించాలి. ఇలాంటి చట్టంలో నిరాధార లేదా దురుద్దేశపూర్వక ఫిర్యాదులపై తగిన చర్యలు, పాఠశాలల్లో అనధికార జోక్యాన్ని నిరోధించే నిబంధనలు, అలాగే విద్యార్థుల హక్కులు మరియు విద్యా ప్రమాణాలను కాపాడే పటిష్ఠమైన ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ ఉండాలి. అలాగే చట్టపరమైన న్యాయ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలి. విద్యాసంస్థలకు రక్షణ, విద్యార్థులకు న్యాయం, సమాజానికి పారదర్శకత—ఈ మూడు లక్ష్యాలను సమన్వయం చేసే విధానమే ఉత్తమమైన విద్యా ప్రమాణాలకు,పరిపాలనకు మార్గం.

# యువకుడు అదృశ్యం

**హాఫీజ్‌పేట్‌లో కనిపించినట్లు సమాచారం**



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** చిట్టిగిద్ద గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమైన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్టిగిద్ద గ్రామానికి చెందిన సోతురాజ్ ప్రదీప్ కుమార్ 23 వికారాబాద్ బస్ డిపోలో కాంట్రాక్ట్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం 10 గంటలకు విధులకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. కానీ తిరిగి రాలేదు. తండ్రి త్యాగరాజు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గిరి తెలిపారు. అయితే ఆదివారం హాఫీజ్‌పేట్‌లో ప్రదీప్‌ను చూసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆచూకీ తెలిసిన వాళ్లు 97049 63510 లేదా నవాబుపేట పోలీస్ స్టేషన్ 87126 70039 కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

# ప్రమీల సూపర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను సందర్శించిన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

**నాణ్యమైన వైద్య సేవలకు అభినందనలు**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ఖమ్మం జిల్లాలోని ప్రముఖ వైద్య సేవా సంస్థ ప్రమీల సూపర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి తాతా మధుసూదన్ మర్యాదపూర్వకంగా సందర్శించారు.తిరుమలాయపాలెం మండలం, పిండిప్రోలు గ్రామ నివాసి పిట్టల నాగేశ్వరరావు స్థాపించిన ఈ హాస్పిటల్ ను ఎమ్మెల్సీ సందర్శించి, అక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా హాస్పిటల్ నిర్వాహకులు ఎమ్మెల్సీ కి అత్యాధునిక వైద్య పరికరాలు నిపుణులైన వైద్యుల సేవలు 24/7 అత్యవసర చికిత్సా విభాగం ప్రజలకు అందిస్తున్న నాణ్యమైన వైద్య సేవలు గురించి వివరించారు.ప్రజలకు అత్యున్నత ప్రమాణాలతో వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో హాస్పిటల్ నిర్వహిస్తున్న తీరును తాతా మధుసూదన్ భినందించారు. "భవిష్యత్తులో మరింత మంది పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరలో నాణ్యమైన వైద్యం అందిస్తూ సేవాభావంతో ముందుకు సాగాలని" ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ నిర్వాహకులు పిట్టల నాగేశ్వరరావు, పిట్టల సతీష్ లను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పగడాల నాగరాజు, బొమ్మెర రామ్మూర్తి, బలుసు మురళి, సద్దాం షేక్, మహమ్మద్ రఫీ, మహమ్మద్ షారుక్, పటేటి సాయి, భరత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు ఇవ్వాలి**




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టీ డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం నాడు వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నాను ఉద్దేశించి టిడబ్ల్యుజేఎఫ్ జిల్లా అధ్యక్షులు టి. రాంచందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వికారాబాద్ జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టులు భారీ సంఖ్యలో ఉన్నారని ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషిచేస్తున్నారని ఎండనక, వాననక విధుల్లో ఉంటున్నారని తెలంగాణ ఉద్యమంలోనూ ప్రాణాలకు తెగించి పోరాడారని ఉద్యమం సందర్భంగా, ఆ తరువాత కూడా వందలాది మంది చనిపోయారని పరిస్థితులు మారుతున్నాయి. ప్రభుత్వాల విధానాలు మారిపోతున్నాయి. కానీ జర్నలిస్టుల బతుకుల్లో మాత్రం ఎలాంటి అభివృద్ధి కనిపించడం లేదని ఉన్న రెండు వర్కింగ్ జర్నలిస్టు చట్టాలను యూనియన్ గవర్నమెంట్ కోడ్‌ల కింద మార్చేసి హక్కులను కాలరాసిందని కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందని అటు యూనియన్ ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అభివృద్ధి, సంక్షేమ పథకాలను జర్నలిస్టులకు అందడం లేదని చివరకు వృత్తి నిర్వహణకు కావాల్సిన అక్రిడిటేషన్ కార్డులు సైతం సకాలంలో ఇవ్వడం లేదని అనేక ఉద్యమాల ఫలితంగా గత రెండు నెలల నుంచి అక్రిడిటేషన్ కార్డులు జారీచేస్తున్నారని అర్హులైన వారందరికి ఇవ్వాలనేది తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) ప్రధాన ఉద్దేశమని ఆయన అన్నారు. జిల్లా కార్యదర్శి ఎండి షఫీ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్‌కార్డులిచ్చి ఆదుకోవాలని గత 40 ఏండ్లుగా ఉమ్మడి రాష్ట్రంతోపాటు తెలంగాణలోనూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని త్వరితగతిన అమలుచేయాలని జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సు పాసులు ఉచితంగా ఇవ్వాలని అలాగే కొత్తగా మెట్రో పాసులను ఉచితంగా జారీచేయాలని ఇకపోతే కరోనాకు ముందు జర్నలిస్టులకు ఉన్న రైల్వే పాసుల సౌకర్యాన్ని యూనియన్ ప్రభుత్వం రద్దుచేసిందని దీన్ని పునరుద్ధరించేలా మోడీ సర్కార్‌పై ఒత్తిడి తేవాలని ఈ సమస్యలను వెంటనే స్పందించి సానుకూలంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

**సమస్యలు:**

1. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను త్వరితగతిన జారీచేయాలి. అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకూ కార్డు ఇవ్వాలి.
2. ఒకే యూనియన్ నుంచి ప్రాతినిథ్యం వహించే వారిని అక్రిడిటేషన్ కమిటీల నుంచి తొలగించాలి. అందరికి సమాన ప్రాతినిథ్యం కల్పించాలి. జర్నరలిస్టులకు న్యాయం జరిగేలా చూడాలి. 3. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నరలిస్టుకూ హెల్త్‌కార్డులివ్వాలి. కంట్రిబూషన్‌ను ప్రభుత్వమే జర్నలిస్టుల తరపున చెల్లించాలి.
4. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఇండ్లస్థలాలు వెంటనే ఇవ్వాలి. యుద్ధప్రాతిపదికన ప్రక్రియకు శ్రీకారం చుట్టాలి.
5. రాత్రిపూట మహిళా జర్నలిస్టులకు పనిచేసే ప్రదేశం నుంచి ఇంటి వరకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలి.
6. జర్నలిస్టులకు ఉచితంగా ఆర్టీసీ, మెట్రో పాసులను అందజేయాలి.
7. రైల్వే పాసుల పునరుద్ధరణ కోసం మోడీ సర్కార్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి ఈ కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ మెంబర్ మాసాని వెంకటయ్య, కోశాధికారి ప్రశాంత్, ఉపాధ్యక్షులు హఫీజ్, భీమ్ శాప్ప, సి శ్రీనివాస్, అనంతయ్య, మురళి గుప్త, కృష్ణ, ఉదయ్, కార్యదర్శులు ఏ. ఆనంద్, ఎజాజ్, జి శ్రీనివాస్, కృష్ణ, అరుణ్ రెడ్డి, నాగిరెడ్డి, జగన్, శ్రీకాంత్, రాకేష్, సంతోష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు

# పాఠశాలలో విత్తన బంతుల తయారీ



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం మద్దికుంట ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చేత విత్తన బంతుల తయారీ ని చేయించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు బాలకృష్ణ ఆధ్వర్యంలో గ్రీన్ జనార్దన్ సహకారంతో పాఠశాలప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల సమక్షంలో చేపట్టడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ ఉప సర్పంచ్ ముత్యాలరాజు వార్డు మెంబర్ లింగమాచారి సాయి రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ , ఉపాధ్యాయులు లక్ష్మణ్ , జోష్నాదేవి, కృష్ణమోహన్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# విప్లవ సాంస్కృతికోద్యమ రథసారథి అరుణోదయ నాగన్న సంస్మరణ సభ



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** సిపిఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి జేవి చలపతిరావు అరుణోదయ సంస్కృతికోద్యమ రథసారథి సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు అరుణోదయ నాగన్న సంస్మరణ సభ సోమవారం రాజారంలో జరిగింది. సంస్మరణ సభ ప్రారంభానికి ముందు గ్రామంలో అరుణోదయ కళాకారులతో కోలాటం,డప్పు డాన్సులతో ప్రదర్శన జరిగింది. బొడ్రాయి సెంటర్లో శ్రీపాద శ్రీహరి విగ్రహానికి గాదె మాధవ రెడ్డి గారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అరుణోదయ నాగన్న స్తూపాన్ని న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి జేవి చలపతిరావు ఆవిష్కరించారు. సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు మందుల రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ కేంద్ర నాయకులు మాధవరెడ్డి రాష్ట్ర అధికార ప్రతినిధి దేవి చలపతిరావు మాట్లాడుతూ నాగయ్య 50 ఏళ్లుగా విప్లవోద్యమంలో సాంస్కృతిక ఉద్యమ సారథిగా పార్టీ నాయకుడిగా ప్రజలకు నాయకత్వం వహించాడు అని అన్నారు.ఈ ప్రాంతంలో భూస్వాముల, పెత్తందారులు కు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో రాష్ట్ర అగ్ర నాయకులతో పాటు నాగన్న పాల్గొన్నారు. కానూరి తాత,అరుణోదయ రామారావు,నాగన్నలు విప్లవ గేయాలతో బుర్రకతలతో ఆంధ్ర లోకాన్ని తెలుగు ప్రజలను చైతన్య పరిచారు. ఈ అగ్ర అరుణోదయ కళాకారులు లేని లోటును నేటి యువ కళాకారులు తీర్చాలని వారు పిలుపునిచ్చారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరు మధు మాట్లాడుతూ నేడు దేశంలో హిందుత్వ పాసిస్తూ భావాజాలం ప్రజలపై మనుషులను విషతుల్యం చేస్తుందని ఈ సమయములో నాగన్న లాంటి విప్లవ సాంస్కృతిక ఉద్యమ రథసారధిని కోల్పోవడం పీడిత ప్రజలకు ప్రజా సంస్కృతికి నష్టమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు జాతీయ నాయకురాలు గాజే ఝాన్సీ అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల చంద్రారెడ్డి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య అరుణోదయ సాంస్కృతిక సమైక్య తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఉదయగిరి అరుణోదయ జిల్లా అధ్యక్షులు పోలే పొంగు నాగయ్య ఏపీటీఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు వేణు సిఎల్సి రాష్ట్ర నాయకులు విప్లవ కుమార్ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తిరుమలాయపాలెం మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ జిల్లా నాయకులు ప్రకాష్,కోలా లక్ష్మీనారాయణ,సురేష్,వెంకటరామిరెడ్డి,గిరి,కాశీం, వీరబోయిన మల్లయ్య,జగన్, గుమ్మడి కనకరాజు కుటుంబ సభ్యులు జీవిత సహచరి పరకాల లక్ష్మి ,అజయ్, గ్రామ సర్పంచ్ మందుల అరుణ గ్రామ పెద్దలు శ్రీనివాసరెడ్డి,మందుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు

# ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పీఆర్టీయూ తెలంగాణ వినతి**

**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** రాష్ట్రంలోని ఉపాధ్యాయుల వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రతినిధులు సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ఉపాధ్యాయులకు ఒకే విధమైన ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గురుకుల, మోడల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా ఉద్యోగ ఆరోగ్య పథకం వర్తింపజేయాలని కోరారు. అదేవిధంగా సీనియర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాధికారులుగా అదనపు బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఉపాధ్యాయుల సంక్షేమం, సేవా భద్రతకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకర్ రావు, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆడే నూర్ సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ర నవీన్ యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విఠల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లను పరిశీలించిన ఎంపీడీఓ




**రాజముద్ర న్యూస్, తిర్యాణి:** మండలంలోని ఏదులపహాడ్ గ్రామపంచాయతీలో నిర్మిస్తున్న గృహాలను సోమవారం మండల అభివృద్ధి అధికారి నగేష్ సందర్శించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పీఎం జన్ మన్ పథకం కింద మంజూరు చేసిన నివాస గృహాలను సందర్శించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. అలాగే మురికి కాలువలు లేక ఇబ్బందులు పడుతున్న నివాస గృహాలను సందర్శించి వారికి మురికి కాలువలను నిర్మించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతోపాటు పంచాయతీలోని సర్ సర్వేను పరిశీలించారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ మడావి పార్వతి అంబారావు, కార్యదర్శి అశోక్, కారోబారి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## పట్టుదలే ఆమె ఆయుధం..

### టీజీ టెట్లో సత్తా చాటిన నేరడిగొండ బిడ్డ





TELANGANA TEACHER ELIGIBILITY TEST (TGTET - JUNE - 2026)
Department of School Education, Telangana, Hyderabad.

Results

| | |
|---|---|
| Name of the Candidate | THALLA PRIYANKA |
| Father's Name | THALLA RAMANAIAH |
| Mother's Name | THALLA ANITHA |
| Hall Ticket Number | 2661100112922 |
| Journal Number | JN260417100380 |
| Year of TET | TGTET-JUNE-2026 |

| Paper I (For Candidates intending to be teachers for Classes I to V) | |
|---|---|
| Maximum Marks | 150 |
| Marks Obtained | 126 (One Hundred Twenty Six) |
| Language Offered | Telugu |
| Subject Offered | NA |

Note: This is a computer generated statement of marks for information of the candidate

Category Wise Pass Percentage and Pass Marks
Maximum Marks: 150

| S.No | Category | Pass Percentage | Pass Marks |
|---|---|---|---|
| 1 | General | 60% | 90 |
| 2 | BC | 50% | 75 |
| 3 | ST/SC | 40% | 60 |
| 4 | PH | 40% | 60 |

Print

**రాజముద్ర న్యూస్, నేరడిగొండ:** నిరంతర కృషి, పట్టుదల ఉంటే ఎంతటి కష్టతరమైన లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని నిరూపించింది నేరడిగొండ మండలకేంద్రానికి చెందిన తాళ్ళ ప్రియాంక. తాజాగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన టీజీ టెట్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి అందరి ప్రశంసలు అందుకుంటోంది. టీజీ టెట్ పేపర్-1 పరీక్షలో ప్రియాంక అద్భుతమైన స్కోరు సాధించింది. మొత్తం 150 మార్కులకు గాను, 126 మార్కులు సాధించి తన విద్యా ప్రతిభను చాటుకుంది. టెట్ వంటి పోటీ పరీక్షల్లో 126 మార్కులు సాధించడం గొప్ప విషయమని, ఇది తన కష్టానికి దక్కిన ప్రతిఫలమని ప్రియాంక సంతోషం వ్యక్తం చేశారు. ఈ విజయం గురించి ప్రియాంక మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన ప్రణాళికాబద్ధమైన చదువే నన్ను ఈ స్థాయికి చేర్చిందని, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం నా విజయానికి తోడయ్యాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న మక్కువతోనే నేను ఈ పరీక్షకు సన్నద్ధమయ్యానని, ఈ మార్కులు రావడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ప్రియాంక విజయంపై నేరడిగొండ మండల ప్రజలు, స్నేహితులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి, పోటీ పరీక్షల్లో ఇంతటి ప్రతిభను కనబర్చడం స్థానిక విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు కొనియాడుతున్నారు. భవిష్యత్తులో మరిన్ని పోటీ పరీక్షల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ విజయం ప్రియాంక ఉపాధ్యాయ వృత్తి వైపు వేస్తున్న అడుగులకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చేలా ఉందంటున్నారు.

## కష్టకాలంలో అండగా నిలిచిన సర్పంచ్ తొడసం రాజేందర్

### మృతురాలి కుటుంబానికి రూ.3 వేల ఆర్థిక సాయం



**రాజముద్ర న్యూస్, జైనూర్:** మండలంలోని పవర్గూడా గ్రామపంచాయతీకి చెందిన అనక లక్ష్మీబాయి అనారోగ్యంతో మృతి చెందగా, గ్రామ సర్పంచ్ తొడసం రాజేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి తనవంతు సహాయాన్ని అందజేశారు. విషయం తెలుసుకున్న వెంటనే మృతురాలి నివాసానికి చేరుకున్న సర్పంచ్ రాజేందర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా తన వ్యక్తిగత సహాయంగా రూ.3వేల నగదు అందించి, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. మృతురాలి కుటుంబం ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను సిద్ధంగా ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు కూడా మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## జంగంపల్లిలో సొంత నిధులతో ఎస్ఐఆర్ సర్వేకు వాలంటీర్ ఏర్పాటు



**రాజముద్ర న్యూస్ భిక్కనూరు:** బిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ సర్వేలో భాగంగా గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సర్పంచ్ వాణి వాసు యాదవ్ సొంత నిధులతో గత నాలుగు రోజులుగా వాలంటీర్‌ను ఏర్పాటు చేశారు. గ్రామస్తులు పలు సూచనలు చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రకాష్, కిసాన్ సంఘం అధ్యక్షులు వెంకటేశం, నాయకులు సత్యం, యాదయ్య, రాములు, పోచయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో సర్వే ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు ప్రజలు సహకరించాలని వారు కోరారు.

# షాబాద్ ఆరు హత్యల కేసులో కీలక పరిణామం..

- నిందితుడు రాజ్‌కుమార్ మృతి..
- పెంజర్ల శివారులో మృతదేహం లభ్యం.. విషపదార్థం సేవించి మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం




నరహంతకుడు రాజ్ కుమార్ మృతదేహం ఇదే పక్కన పాయిజన్ బాటిల్ లభ్యం.

**రామంతపూర్, జూలై 13 ( రాజముద్ర న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు హత్యకు గురైన సంచలన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ శివారులో మృతిగా కనిపించినట్లు సమాచారం. విషపదార్థం సేవించి మృతి చెందినట్లు ప్రాథమికంగా తెలుస్తుండగా, పోలీసులు పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, ఇంటర్మీడియట్ చదివే సమయంలో తనకు ట్యూషన్ చెప్పిన ఉపాధ్యాయురాలు సరితను రాజ్‌కుమార్ ప్రేమ పేరుతో వేధించి, ఆమె కుటుంబ సభ్యులు ఇతర సంబంధాలు చూడగా వాటిని అడ్డుకుని 2018లో వివాహం చేసుకున్నట్లు తెలుస్తోంది.

వివాహానంతరం డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించిన రాజ్‌కుమార్ బెట్టింగ్‌లు, జూదం, మద్యం వంటి వ్యసనాలకు బానిసై భారీ అప్పులు చేశాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అప్పుల భారంతో గతంలో ఆత్మహత్యాయత్నం చేయగా, అతని తల్లిదండ్రులు పొలం విక్రయించి అప్పులు తీర్చినట్లు సమాచారం. అనంతరం మరిన్ని ఆస్తులు విక్రయించేలా ఒత్తిడి తెచ్చి, ఆ డబ్బును జల్సాలు, వ్యసనాలకే ఖర్చు చేసినట్లు బంధువులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, నిరంతర వేధింపులు భరించలేక భార్య సరిత విడాకులు కోరడంతో రాజ్‌కుమార్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడని, అదే పగతో సరితతో పాటు ఇద్దరు చిన్నారులు మరియు కుటుంబ సభ్యులను హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. రాజ్‌కుమార్ మృతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, ఫోరెన్సిక్ పరీక్షల అనంతరం మరణానికి గల ఖచ్చితమైన కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

### డాక్టర్ సురేష్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నేడు పీహెచ్‌సీ రామారెడ్డిపరిధిలకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు వైద్యాధికారి డా. ఎం. సురేష్ తెలిపారు.ఈ కార్యక్రమాన్ని రామారెడ్డి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గ్రామ సర్పంచ్ బండి ప్రవీణ్ చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 5,755 మంది పిల్లలకు( 1-19 ఇయర్స్) ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయాల్సి ఉండగా, నేడు 5,321 మంది పిల్లలకు మాత్రలు అందజేసి 92.45 శాతం లక్ష్యాన్ని విజయవంతంగా సాధించినట్లు ఆయన తెలిపారు.మిగిలిన పిల్లలకు జూలై 20న నిర్వహించే మాప్-అప్ దినోత్సవం సందర్భంగా ఆల్బెండాజోల్ మాత్రలు అందజేసి 100 శాతం లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా డా. సురేష్ మాట్లాడుతూ, మన మండలంలోని ప్రతి చిన్నారికి తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.నులిపురుగుల నివారణ వల్ల పిల్లల్లో రక్తహీనత (అనీమియా), పోషకాహార లోపం (మాల్‌న్యూట్రిషన్) తగ్గడంతో పాటు శారీరక ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు.అలాగే జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మానసిక వికాసం పెరిగి చదువులో మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుందని వివరించారు. అంతేకాకుండా పేగుల్లో ఉండే నులిపురుగులు, ఇతర ఇన్‌ఫెక్షన్లనునియంత్రించడంలో కూడా ఆల్బెండాజోల్ మాత్రలు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ వనిత, హెల్త్ ఎడ్యుకేటర్ జార్జ్, హెల్త్ సూపర్‌వైజర్ రాజమణి, ఆశా కార్యకర్త ప్రమీల, ఏఎన్ఎం రజిత,పాఠశాలఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చెరువు ఆక్రమణల తొలగింపునకు ముందు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్



**రామంతపూర్, జూలై 13, (రాజముద్ర న్యూస్):** హబ్సిగూడ–రామంతపూర్ పెద్దచెరువు గట్లపై సుమారు 40 సంవత్సరాలుగా నివసిస్తున్న గుడిసెవాసులకు ముందుగా ప్రత్యామ్నాయంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించి, అనంతరం చెరువు ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌ను స్థానికులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ సమక్షంలో వేములకొండ సోమశేకర్ గౌడ్, రాముపతి గౌడ్, ములాజిగిరి జిల్లా కలెక్టర్‌ను కలిసి చెరువు పరిరక్షణతో పాటు నిరుపేద కుటుంబాల జీవన భద్రతను కూడా దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం పెద్దచెరువు సుందరీకరణకు నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో, చెరువును ఆక్రమణల నుంచి విముక్తం చేయడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదని, అయితే దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలను ప్రత్యామ్నాయ నివాసం లేకుండా ఖాళీ చేయించడం సామాజికంగా అన్యాయమని వారు పేర్కొన్నారు. అర్హులైన గుడిసెవాసులకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించి, అనంతరం చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. సమస్యను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

# పేదల సొంతింటి కల సాకారం

- ఇందిరమ్మ గృహప్రవేశంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్
- వేంసూరుకు గోదావరి జలాల రాకపై హర్షం వ్యక్తం



**రాజముద్ర న్యూస్, సత్తుపల్లి:** పేదల సొంతింటి కల సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు రాజీవ్ కాలనీలో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాలొగని రాజీవ్ కాలనీకి చెందిన లబ్ధిదారులు శ్రీరాముల లక్ష్మి , కృష్ణ నూతన గృహప్రవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రతి పేద కుటుంబం సొంతింటి కలను సాకారం చేసుకోవడం ఎంతో ఆనందదాయకమైన విషయమని పేర్కొన్నారు. నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రెహాన బేగం కమల్ పాషా, 7వ వార్డు కౌన్సిలర్ నసీమ షరీఫ్, కౌన్సిలర్లు హకీమ్, శరత్, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, రాజీవ్ కాలనీ ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**గోదావరి జలాల రాక రైతులకు ఊరట..**

వేంసూరు మండలానికి గోదావరి జలాలు చేరడంపై ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ హర్షం వ్యక్తం చేశారు. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు గోదావరి జలాల రాక ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. కాల్వల్లో నీరు ప్రవహిస్తుండటంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయని, వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న రైతులకు సాగునీరు అత్యంత కీలకమని అన్నారు. గోదావరి జలాలు వేంసూరు మండలానికి చేరడం రైతాంగానికి శుభపరిణామమని అన్నారు. పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.



## సీఎస్కే కొత్త కోచ్ రేసులో
# ధోనీ, అశ్విన్!

ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. తమ జట్టుతో 18 ఏళ్లుగా హెడ్ కోచ్‌గా కొనసాగుతున్న స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించింది. ఫ్లెమింగ్ కోచింగ్‌లో సీఎస్కే ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ గెలుచుకుంది. ఎంఎస్ ధోనీతో అతనికి ఉన్న అవినాభావ సంబంధం జట్టు విజయాలకు మూలస్తంభంగా నిలిచింది. అయితే, గత మూడేళ్లుగా సీఎస్కే ప్లేఆఫ్స్‌కు కూడా అర్హత సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో ఫ్రాంచైజీ యాజమాన్యం ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆధునిక టీ20 ఫార్మాట్‌లో అవసరమైన కొత్త వ్యూహాలు, ఆలోచనలు ఫ్లెమింగ్ వద్ద కొరవడ్డాయని, అందుకే జట్టు ప్రక్షాళనలో భాగంగా ఈ మార్పు చేపట్టినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. ఫ్లెమింగ్ నిష్క్రమణతో అతని స్థానాన్ని భర్తీ చేసే కొత్త కోచ్ ఎవరనే దానిపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. పలువురు దిగ్గజాలు, యువ కోచ్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. కొత్త కోచ్ రేసులో ధోనీ, ద్రవిడ్, అశ్విన్, దినేశ్ కార్తీక్, హేమంగ్ బదానీ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

## టీమిండియాతో తొలి మ్యాచ్‌కు
# ఇంగ్లండ్ జట్టు ప్రకటన



భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మూడు వన్డేల సిరీస్‌కు రంగం సిద్ధమైంది. మంగళవారం బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరగనున్న తొలి మ్యాచ్ కోసం ఇంగ్లండ్ తమ తుది జట్టును ప్రకటించింది. ఈ మ్యాచ్‌లో యువ ఆల్‌రౌండర్ జాకబ్ బెథెల్‌ను ఓపెనర్‌గా బరిలోకి దించుతూ ఇంగ్లండ్ యాజమాన్యం ఆశ్చర్యకర నిర్ణయం తీసుకుంది. సీనియర్ బ్యాటర్ బెన్ డకెట్‌తో కలిసి అతను ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. ఈ మ్యాచ్ ఇంగ్లండ్ వికెట్ కీపర్-బ్యాటర్ జోస్ బట్లర్‌కు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకం కానుంది. అతను తన కెరీర్‌లో 200వ వన్డే ఆడబోతున్నాడు. ఇంగ్లండ్ వైట్-బాల్ క్రికెట్‌లో కీలక ఆటగాడిగా ఉన్న బట్లర్, 2012 ఫిబ్రవరి 21న దుబాయ్‌లో పాకిస్థాన్‌పై తన వన్డే అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు ఆడిన 199 మ్యాచ్‌లలో 39.11 సగటుతో 5,515 పరుగులు సాధించాడు. ఇందులో 11 సెంచరీలు, 29 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఈ మైలురాయి మ్యాచ్‌లో అతను ఎలా రాణిస్తాడనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే 21 వన్డేలు ఆడిన యువ డైనమిక్ ప్లేయర్ బెథెల్‌ను ఓపెనర్‌గా ప్రమోట్ చేయడం వెనుక బలమైన కారణమే ఉంది. బెన్ డకెట్‌కు సరైన భాగస్వామిని కనుగొనాలనే ఇంగ్లండ్ ప్రయత్నాలు దీని ద్వారా స్పష్టమవుతున్నాయి. ఇటీవలి కాలంలో ఫిల్ సాల్ట్, జేమీ స్మిత్, జాక్ క్రాలీ, రెహాన్ అహ్మద్ తర్వాత డకెట్‌కు ఐదో ఓపెనింగ్ భాగస్వామిగా బెథెల్ నిలవనున్నాడు. ఇది ఓపెనింగ్ స్థానంపై ఇంగ్లండ్ జట్టులో నెలకొన్న అస్థిరతను సూచిస్తోంది. మరోవైపు, కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్ వంటి బలమైన భారత బ్యాటింగ్‌ను కట్టడి చేసేందుకు కెప్టెన్ హ్యారీ బ్రూక్ నేతృత్వంలోని ఇంగ్లండ్ జట్టు పకడ్బందీ వ్యూహంతో బరిలోకి దిగుతోంది. విల్ జాక్స్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్ రూపంలో ముగ్గురు స్పిన్నర్లతో దాడి చేయాలని నిర్ణయించుకుంది. పేస్ బాధ్యతలను జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ మోయనున్నారు. ఇటీవల టీ20 సిరీస్‌లో అదరగొట్టిన ఆర్చర్, గతేడాది నవంబర్ తర్వాత తొలిసారిగా వన్డే జట్టులోకి తిరిగి వచ్చాడు. దీంతో గస్ అట్కిన్‌సన్‌కు తుది జట్టులో చోటు దక్కలేదు. ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి వన్డే జరగనుంది. ఇరు జట్లు జూలై 16న కార్డిఫ్‌లో రెండో వన్డే, జూలై 19న లార్డ్స్‌లో మూడో వన్డేలో తలపడనున్నాయి.

**తొలి వన్డేకు ఇంగ్లండ్ తుది జట్టు:**

జాకబ్ బెథెల్, బెన్ డకెట్, జో రూట్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), శామ్ కరన్, విల్ జాక్స్, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్, జోష్ టంగ్, ఆదిల్ రషీద్.




# భారత మహిళదే లార్డ్స్



## భారత అమ్మాయిల చరిత్రాత్మక విజయం

లార్డ్స్ టెస్టులో భారత అమ్మాయిలు అద్భుతం చేశారు. నాలుగో రోజు తొలి సెషన్‌లోనే ఇంగ్లండ్ మిడిలార్డర్‌ను పడగొట్టి చరిత్రాత్మక విజయంతో సంబురాలు చేసుకున్నారు. టీ20 ప్రపంచకప్ వైఫల్యాన్ని మరిపించేలా.. 270 పరుగుల తేడాతో గెలుపొంది యావత్ భారతావనిని పులకింపజేశారు.

**తొలి ఇన్నింగ్స్‌లోనే ఇంగ్లండ్ పాలిట విలన్‌లా మారిన పేసర్ క్రాంతి గౌడ్ నిప్పులు చెరగడంతో ఆతిథ్య జట్టుకు ఓటమి తప్పలేదు. యస్తికా భాటియా(113) రికార్డు శతకం.. స్మృతి మంధాన(70)ల బ్యాటింగ్ మెరుపులతో కుదేలైన ఇంగ్లండ్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.**

ఇంగ్లండ్ గడ్డపై భారత పురుషుల జట్టుకు చెంపపెట్టులాంటి విజయం సాధించారు అమ్మాయిలు. పేలవమైన ఆటతో టీ20 సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన శ్రేయాస్ అయ్యర్ సేనకు.. ఇంగ్లండ్‌ను ఇలా ఓడించాలి అని చాటిచెప్పింది హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం. లార్డ్స్‌లో జరిగిన ఏకైక టెస్టులో యువ పేసర్ క్రాంతి గౌడ్(2-54) విజృంభణతో ఆతిథ్య జట్టు బ్యాటర్లు తోకముడిచారు. బ్యాటుతో మెరిసిన స్మృతి మంధాన(70), యస్తికా భాటియా(113)లు చిరస్మరణీయ విజయంలో కీలకమయ్యారు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ తేలిపోయిన ఆతిథ్య జట్టు పొట్టి వరల్డ్‌కప్ ఓడిన చోటే.. ఏకైక టెస్టులోనూ చతికిలపడింది. టీమిండియా రెండో ఇన్నింగ్స్‌ను 341-7 వద్ద డిక్లేర్ చేశాక.. బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 6 పరుగులకే ఓపెనర్లను కోల్పోయింది. 457 పరుగుల భారీ ఛేదనలో క్రాంతి గౌడ్(2-54).. సయాలీ సత్ఘరే(2-24)ల ధాటికి ఆతిథ్య జట్టు చేతులెత్తేసింది. ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న టమ్మీ బ్యూమంట్(0), హీథర్ నైట్(13)లను ఔట్ చేసిన క్రాంతి విజయానికి పునాది వేసింది. మూడో రోజు పోరాడిన అమీ జోన్స్.. నాలుగోరోజు తొలి సెషన్‌లోనే ఔటవ్వగా.. టీమిండియా విజయం మరింత సలువైంది. ఓవర్‌నైట్ స్కోర్ 130-6తో నాలుగో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ చూస్తుండగానే కుప్పకూలింది. తొలి సెషన్ మొదట్లోనే అమీ జోన్స్(54) వికెట్ తీసిన స్నేహ్ రాణా(4-42) ఆతిథ్య జట్టు ఓటమిని ఖాయం చేసింది. సోఫీ ఎకిల్‌స్టోన్(50)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 22 రన్స్ జోడించిన ఇసీ వాంగ్(1)ను దీప్తి శర్మ బౌల్డ్ చేసింది. తర్వాతి ఓవర్లోనే లారెన్ బెల్(0)ను దీప్తి బౌల్డ్ చేయగా.. క్రీజునంటుకున్న ఎకిల్‌స్టోన్‌ను రాణా ఔట్ చేసి తరాతరాలు చెప్పుకోదగగిన విజయంలో భాగమైంది. లార్డ్స్ టెస్టులో రెండో రోజు పట్టుబిగించిన భారత జట్టు పేసర్ క్రాంతి గౌడ్(5-37) సంచలన ప్రదర్శనతో ఇంగ్లండ్‌ను పడగొట్టింది. సొంతగడ్డపై దంచేయాలనుకున్న ఇంగ్లండ్ బ్యాటర్లను వణికించిన క్రాంతి.. మొదటి సెషన్‌లోనే కోలుకోలేని దెబ్బకొట్టింది. ఓపెనర్ మియా బౌచిర్(23)ను పెవిలియన్ చేర్చిన స్పీడ్‌స్టర్.. బౌండరీలతో చెలరేగుతున్న అలిసే క్యాప్సే(9)ను స్వింగ్‌తో వెనక్కి పంపింది. మరో ఎండ్‌లో సయాలీ సత్ఘరే(2-40), స్నేహ్ రాణా(2-41) రెచ్చిపోగా లంచ్ లోపే సగం మంది పెవిలియన్ చేరారు. అర్ధ శతకం బాదిన అమీ జోన్స్ (52) వెనుదిరిగినా.. పట్టువదలకుండా క్రీజునంటుకున్న కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(44) పోరాడింది. కానీ, లంచ్ తర్వాత ఆమెను సైతం గౌడ్ వెనక్కి పంపింది. లారెన్ బెల్‌ను ఔట్ చేయడం ద్వారా టెస్టుల్లో మొదటిసారి ఐదు వికెట్లు తీసింది భారత స్పీడ్‌స్టర్. చివరి బ్యాటర్ లారెన్‌ను దీప్తి ఎల్బీ చేయడంతో 170 వద్ద ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది. ఫలితంగా తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియాకు 115 పరుగుల ఆధిక్యం లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్ స్మృతి మంధాన (83), హర్మన్‌ప్రీత్ కౌర్(58)లు అర్ధ శతకాలతో పటిష్టమైన పునాది వేసినా లాభం లేకపోయింది. ఇంగ్లండ్ స్పిన్నర్ మ్యాడీ విల్లియర్స్(2-79) ధాటికి మిడిలార్డర్ వైఫలమైంది. ఓవైపు వికట్లు పడుతున్నా బాధ్యతగా ఆడిన దీప్తి శర్మ(57) టెయిలెండర్లతో కలిసి పోరాడి స్కోర్ 280 దాటించింది. కానీ, ఒకే ఓవర్లో దీప్తిని, క్రాంతి గౌడ్‌ను ఔట్ చేసిన సోఫీ ఎకిల్‌స్టోన్(3-68) భారత ఇన్నింగ్స్‌కు తెరదించింది.

## అందమైన ముందడుగు: సచిన్

లార్డ్స్‌లో చారిత్రక విజయం సాధించిన టీమిండియా మహిళల క్రికెట్ జట్టుపై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో తొలిసారిగా జరిగిన మహిళల టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై హర్మన్‌ప్రీత్ కౌర్ సేన గెలవడం ఒక చారిత్రక ఘట్టమని అభివర్ణించాడు. మహిళల క్రికెట్ ప్రస్థానంలో ఇది మరో ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నాడు. ఈ మ్యాచ్ చివరి రోజున సచిన్ స్వయంగా మైదానంలో ఉండి విజయాన్ని వీక్షించాడు. ఆట ప్రారంభానికి ముందు సచిన్ భారత మహిళా క్రికెటర్లతో మాట్లాడాడు. ఇంగ్లండ్‌పై భారత్ 270 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించిన అనంతరం, సచిన్ సోషల్ మీడియా వేదికగా తన స్పందనను పంచుకున్నాడు. "ప్రతి క్రికెటర్‌కు లార్డ్స్‌లో ఆడాలనే కల ఉంటుంది. గత నాలుగు రోజులుగా, తొలిసారిగా ఇక్కడ మహిళల టెస్ట్ క్రికెట్ జరగడంతో కొత్త తరం క్రీడాకారిణులు ఆ కలను సాకారం చేసుకున్నారు" అని సచిన్ పేర్కొన్నాడు. ఈ అద్భుత విజయం సాధించిన భారత జట్టుకు అభినందనలు తెలిపిన సచిన్, కీలక క్రీడాకారిణుల ప్రదర్శనను ప్రత్యేకంగా ప్రస్తావించాడు. "వైస్ కెప్టెన్ స్మృతి మంధాన నిలకడ, యాస్తిక భాటియా అద్భుతమైన సెంచరీ, పేసర్ క్రాంతి గౌడ్ ఐదు వికెట్ల ప్రదర్శన ఈ సందర్భాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయి" అని కొనియాడాడు.

## లెస్బియన్ క్రికెట్ దంపతుల గోల!

ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టులో సీనియరైన అష్లే గార్డ్‌నర్ వివాదంలో ఇరుక్కుంది. మరో మహిళను పెళ్లి చేసుకున్న ఈ ఆల్‌రౌండర్ ఇప్పుడు మరొకరితో ప్రేమాయాణం సాగిస్తుందనే




వార్త వైరలవుతోంది. గార్డ్‌నర్‌పై ఈ ఆరోపణలు చేసింది ఆమె భార్య మోనికా రైట్ కావడం గమనార్హం. మోనికా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకున్న ఈ అఫైర్ విషయం డెయిలీ మెయిల్ వార్థ సంస్థలో ప్రచురితమైంది. గార్డ్‌నర్ అఫైర్‌పై భగ్గుమన్న మోనికా.. ఆస్ట్రేలియా క్రికెటర్ జార్జియా వోల్ ఫొటోను షేర్ చేస్తూ.. 'ఈవిడే మా కాపురాన్ని నాశనం చేసింది' అని వెల్లడించింది. అన్యోన్యంగా ఉండే తమ మధ్య దూరం పెరగడానికి కారణం భారత పర్యటనే అంటోంది మోనికా. భారత్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్ కోసం గార్డ్‌నర్‌తో పాటు ఆమె భార్య మోనికా కూడా వచ్చింది. అయితే.. టోర్నీ సమయంలోనే గార్డ్‌నర్ ప్రవర్తనలో తేడాను గమనించింది మోనిక. స్వదేశం వచ్చాక ఇదే విషయంపై తన భాగస్వామిని ఆమె ప్రశ్నించింది. అప్పుడు.. గార్డ్‌నర్ మన మధ్యలో ఏదో మార్పు వచ్చింది. ఇక కలిసి ఉండడం కుదరదు అని తేల్చి చెప్పింది. అక్కడితో వీరి పెళ్లి పెటాకులైంది. నిరుడు నవంబర్‌లోనే ఆసీస్ ఆల్‌రౌండర్ సిడ్నీలో తాము కలిసి ఉంటున్న ఇంటిని వీడింది. వెళ్తూ వెళ్తే తమ పెళ్లి ఉంగరాలను అక్కడే వదిలేసిందని డెయిలీ మెయిల్ కథనం పేర్కొంది. ఐదేళ్ల ప్రేమలో మునిగితేలిన గార్డ్‌నర్, మోనికలు 2025 ఏప్రిల్‌లో పెళ్లి చేసుకున్నారు. ఏడాది పూర్తికాగానే వీరి మధ్య మనస్పర్థలు.. పరాయి ఆకర్షణలు పెరగడంతో వీరి బంధం ముగిసింది.

## జూన్ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' నామినేషన్లలో గిల్



జూన్ నెలకు గానూ ఐసీసీ పురుషుల 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డుకు భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నామినేట్ అయ్యాడు. జూన్ నెలలో బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన కనబర్చిన గిల్‌తో పాటు బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్, న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ నాథన్ స్మిత్ కూడా ఈ అవార్డు కోసం పోటీలో ఉన్నట్లు ఐసీసీ సోమవారం ప్రకటించింది. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన హోం సిరీస్‌లో గిల్ టెస్టు, వన్డే ఫార్మాట్లలో అద్భుతంగా రాణించాడు. న్యూ చండీగఢ్‌లో జరిగిన ఏకైక టెస్టులో 126 పరుగులు చేసి భారత ఇన్నింగ్స్ విజయానికి కీలకంగా నిలిచాడు. అనంతరం వన్డే సిరీస్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనే 238 పరుగులు సాధించాడు. తొలి వన్డేలో 66 బంతుల్లో 84 పరుగులు చేసిన గిల్, లక్నో వన్డేలో కాళ్ల నొప్పితో ఇబ్బంది పడుతూనే 110 బంతుల్లో 154 పరుగులు చేసి భారత్‌కు విజయం అందించాడు. ఆ మ్యాచ్‌తో పాటు సిరీస్‌లోనూ అత్యుత్తమ ఆటగాడిగా నిలిచి, భారత్ 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. నాలుగేళ్ల విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వచ్చిన బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్ ఆస్ట్రేలియాపై తన జట్టుకు చారిత్రక 2-1 వన్డే సిరీస్ విజయం అందించడంలో కీలక పాత్ర పోషించాడు.




## 'కొరియన్ కనకరాజు' టీజర్‌కు

# ప్రభాస్ శ్రీకారం

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న వైవిధ్యభరిత చిత్రం 'కొరియన్ కనకరాజు'కు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రంలోని 'కిమ్‌చి కారం' టీజర్‌ను పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించింది. సోమవారం సాయంత్రం 4.05 గంటలకు సామాజిక మాధ్యమాల వేదికగా టీజర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపింది. 'కొరియన్ కనకరాజు ప్రపంచాన్ని మీకు పరిచయం చేయడానికి రెబల్ స్టార్ ప్రభాస్ వస్తున్నారు' అంటూ చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ టీజర్ ద్వారా సినిమాలో వరుణ్ తేజ్ పాత్ర, ఆయన హావభావాలు, నటన శైలి ఎలా ఉండబోతుందో ప్రేక్షకులకు పరిచయం చేయనున్నట్లు సమాచారం. 'భారత--కొరియా వినోదం' అనే భావనతో రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి గాంధీ మేర్లపాక దర్శకత్వం వహిస్తున్నారు. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, యూవీ క్రియేషన్స్, టీ-సిరీస్ సౌత్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నిర్మాతలుగా రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి వ్యవహరిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మాణ భాగస్వామిగా ఉండటంతో ప్రభాస్ ఈ టీజర్‌ను విడుదల చేయడానికి ముందుకు వచ్చినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ స్వరాలు సమకూరుస్తున్న ఈ యాక్షన్ వినోదాత్మక చిత్రాన్ని ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. టీజర్ విడుదలతో సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు.

## 'సూర్య సన్ ఆఫ్ కృష్ణన్'లో తొలి ఎంపిక దీపికా?

దక్షిణాది సినీ పరిశ్రమలో అందమైన ప్రేమకథలను తెరపై ఆవిష్కరించిన దర్శకుల్లో గౌతమ్ వాసుదేవ్ మీనన్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఆయన తెరకెక్కించిన 'వారణం ఆయిరం' చిత్రం తెలుగులో 'సూర్య సన్ ఆఫ్ కృష్ణన్' పేరుతో విడుదలై ప్రేక్షకుల మన్ననలు పొందింది. వాణిజ్యపరంగా ఆశించిన విజయాన్ని అందుకోకపోయినా, కథ, భావోద్వేగాలు, సంగీతంతో ఈ చిత్రం ఇప్పటికీ సినీ అభిమానుల హృదయాల్లో ప్రత్యేక స్థానం దక్కించుకుంది. సూర్య ద్విపాత్రాభినయం చేసిన ఈ చిత్రానికి హారిస్ జయరాజ్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇందులోని ప్రతి పాట ఇప్పటికీ సంగీత ప్రియులను అలరిస్తూ సామాజిక మాధ్యమాలు, సంగీత వేదికల్లో ఆదరణ పొందుతోంది. చిత్రంలో సూర్య సరసన సమీరా రెడ్డి కథానాయికగా నటించి తన నటనతో ప్రశంసలు అందుకున్నారు. అయితే ఈ పాత్రకు తొలుత బాలీవుడ్ నటి దీపికా పదుకొణెను ఎంపిక చేయాలని దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ భావించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మోడల్‌గా ఉన్న సమయంలోనే దీపికాకు ఈ చిత్రంలో నటించే అవకాశం వచ్చినప్పటికీ, అప్పటికే షారుఖ్ ఖాన్ సరసన 'ఓం శాంతి ఓం' చిత్రంలో నటించే అవకాశం రావడంతో తేదీల సమస్య కారణంగా ఈ చిత్రాన్ని వదులుకున్నట్లు సమాచారం. దీంతో సమీరా రెడ్డిని కథానాయికగా ఎంపిక చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఈ చిత్రం ద్వారానే సమీరా రెడ్డి తమిళ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. తొలి చిత్రంతోనే నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, అనంతరం తెలుగు, తమిళం, హిందీ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించారు. తెలుగులో జూనియర్ ఎన్టీఆర్, చిరంజీవి వంటి అగ్ర కథానాయకుల సరసన నటించి ప్రేక్షకులను అలరించిన సమీరా రెడ్డి, వివాహం అనంతరం సినిమాలకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ అభిమానులతో తన అనుభవాలను పంచుకుంటున్నారు.






## ఒడిదొడుకులు దాటి మళ్లీ వెలుగులోకి అమీషా పటేల్

బాలీవుడ్ ప్రముఖ నటి అమీషా పటేల్ సినీ ప్రయాణం విజయాలు, ఒడిదొడుకులతో సాగింది. 2000లో హృతిక్ రోషన్ సరసన నటించిన 'కహో నా ప్యార్ హై' చిత్రంతో వెండితెరకు పరిచయమైన ఆమె, తొలి సినిమాతోనే ఘన విజయాన్ని అందుకుని రాత్రికి రాత్రే స్టార్ కథానాయికగా గుర్తింపు పొందారు. రాకేష్ రోషన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత తెలుగు సినీ పరిశ్రమలో పవన్ కళ్యాణ్ సరసన 'బద్రి' చిత్రంలో నటించి తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువయ్యారు. అనంతరం సన్నీ డియోల్‌తో కలిసి నటించిన 'గదర్: ఏక్ ప్రేమ్ కథ' చిత్రంలోని 'సకీనా' పాత్ర ఆమెకు దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపును తీసుకొచ్చింది. ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలో అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. తదుపరి 'హమ్‌రాజ్', 'భూల్ భులయ్యా' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించినప్పటికీ, ఆ తర్వాత ఆమె సినీ జీవితంలో కొన్ని ఒడిదొడుకులు ఎదురయ్యాయి. కొన్ని చిత్రాలు ఆశించిన విజయాన్ని అందుకోకపోవడం, వ్యక్తిగత కారణాలతో కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్నారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత 2023లో విడుదలైన 'గదర్ 2'తో అమీషా పటేల్ ఘనంగా తిరిగి ప్రేక్షకుల ముందుకు వచ్చారు. సన్నీ డియోల్, అమీషా పటేల్ జంట మరోసారి ప్రేక్షకులను అలరించడంతో ఈ చిత్రం రూ.500 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఘన విజయాన్ని అందుకుంది. 'సకీనా' పాత్రకు ఇప్పటికీ ప్రేక్షకుల్లో ఉన్న ఆదరణను ఈ చిత్రం మరోసారి నిరూపించింది. ఈ విజయంతో 'గదర్ 3' నిర్మాణానికి కూడా సన్నాహాలు జరుగుతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. 'కహో నా ప్యార్ హై'తో ప్రారంభమైన అమీషా పటేల్ సినీ ప్రయాణం ఎన్నో సవాళ్లను అధిగమించి నేటికీ విజయవంతంగా కొనసాగుతోంది. 1975 జూన్ 9న ముంబైలో జన్మించిన ఆమె ప్రముఖ న్యాయవాది, రాజకీయ నాయకుడు రజనీ పటేల్ మనవరాలు. సినిమా నేపథ్యం లేకపోయినా తన ప్రతిభతో సినీ రంగంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తెలుగులో జూనియర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా నటించిన 'నరసింహుడు' చిత్రంలో కథానాయికగా నటించిన అమీషా పటేల్, మహేష్ బాబు నటించిన 'నాని' చిత్రంలో ఒక ప్రత్యేక గీతంలో కూడా సందడి చేశారు. ప్రస్తుతం ఎంపిక చేసిన చిత్రాల్లో మాత్రమే నటిస్తూ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

## ఒక్క రాత్రిలో తొమ్మిది సినిమాలు కోల్పోయా: విద్యా బాలన్

ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా గుర్తింపు పొందిన విద్యా బాలన్ తన సినీ జీవిత ప్రారంభంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నట్లు వెల్లడించారు. ఒక సినిమా ఆగిపోవడంతో తనపై "ఐరన్ లెగ్" అనే ముద్ర వేసి, ఒక్క రాత్రిలోనే తొమ్మిది చిత్రాల నుంచి తొలగించారని ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఒక యూట్యూబ్ ఇంటర్వ్యూలో మాట్లాడిన విద్యా బాలన్, తన సినీ ప్రయాణం ప్రారంభ రోజులను గుర్తు చేసుకున్నారు. మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ సరసన 'చక్రం' చిత్రంలో నటించే అవకాశం తనకు వచ్చిందని తెలిపారు. అయితే చిత్రీకరణ ప్రారంభమైన కొద్ది రోజులకే అనివార్య కారణాలతో ఆ సినిమా నిలిచిపోయిందని చెప్పారు. ఆ సినిమా ఆగిపోవడానికి తానే కారణమని కొందరు ప్రచారం చేశారని, దీంతో తనపై "ఐరన్ లెగ్" అనే ముద్ర వేశారని విద్యా బాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రచారం కారణంగా ఒక్క రాత్రిలోనే తొమ్మిది సినిమాల నుంచి తనను తొలగించారని తెలిపారు. ఆ సమయంలో తాను తీవ్ర మానసిక వేదన అనుభవించినట్లు చెప్పారు. అయితే వాస్తవానికి సినిమా ఆగిపోవడానికి తనకు ఎలాంటి సంబంధం లేదని, దర్శకుడు, మోహన్‌లాల్ మధ్య ఏర్పడిన అభిప్రాయ భేదాల వల్లే ఆ ప్రాజెక్టు నిలిచిపోయిందని విద్యా బాలన్ స్పష్టం చేశారు. కానీ ఆ సంఘటన తన సినీ జీవితంపై తీవ్ర ప్రభావం చూపిందని పేర్కొన్నారు. అనేక ఇబ్బందులు, విమర్శలను ఎదుర్కొన్నప్పటికీ తన ప్రతిభపై నమ్మకం కోల్పోలేదని, కష్టపడి అవకాశాలను అందిపుచ్చుకుని నటిగా తనను తాను నిరూపించుకున్నానని విద్యా బాలన్ తెలిపారు. అనంతరం వరుస విజయాలతో భారతీయ సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా ఎదిగి, తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ప్రస్తుతం ఎంపిక చేసిన చిత్రాల్లో మాత్రమే నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు.



Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com